PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 215 | విజయవాడ, బుధవారం 8 మార్చి 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50


Vol No | Vijayawada, Wednesday 8 March 2023 | Rs

రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కినా...

బాజాభజంత్రీలతో స్వాగతం

- బిజెపి ఎమ్మెల్యేకు ముందస్తు బెయిల్..
- దర్యాప్తు అధికారుల బదిలీ

● లోపలి పేజీలో.. ●



అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

ప్రత్యేక కథనం 4లో



మీడియాతో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు, చిత్రంలో రామకృష్ణ

ఉద్యోగులను మోసం చేసిన వైసిపికి ఓటు అడిగే అర్హత లేదు

ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి రాజీనామా చేయాలి

సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు శ్రీనివాసరావు, రామకృష్ణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగులు, ఉపాధ్యాయులను మోసం చేసిన వైసిపికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే అర్హత లేదని సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం విజయవాడ బాలోత్సవ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల తొమ్మిది నుండి జరగనున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆందోళనకు మద్దతు ప్రకటించారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచేందుకు ఎమ్మెల్యేలు, ఎంపిలు విచ్చలవిడిగా అక్రమాలు, అన్యాయాలకు పాల్పడుతున్నారని, వీటిపై ఎన్నికల సంఘానికి ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని, సిఎం జగన్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం నడుస్తున్నారని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే ఆరునెలల్లో సిపిఎస్ రద్దుచేస్తానని జగన్ చెప్పారని, ఇప్పుడు మాట తప్పి జిపిఎస్ అంటున్నారని విమర్శించారు. ఒక్కసారి కూడా డిఎస్‌సి పెట్టలేదని, 1998 బ్యాచ్ సమస్య కూడా పరిష్కారం కాలేదని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయకుండా, మభ్యపెట్టి, మోసం చేస్తున్నారని అన్నారు. మాట తప్పం, మడమ తిప్పబోమని చెప్పి మాట తప్పారని, మడమ తిప్పారని విమర్శించారు.

గుంటూరు, కృష్ణా ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి గెలిస్తే ఆరునెలల్లో యునిఫైడ్ సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరిస్తామని లేదంటే రాజీనామా చేస్తానని 2021 మార్చిలో చెప్పారని, రెండు సంవత్సరాలు గడిచినా ఒక్క సమస్యనూ పరిష్కరించలేదని తెలిపారు. మ్యానిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్ అని ప్రమాణం చేసి రెండేళ్లలో సమస్యలు పరిష్కారం కాకపోతే రాజీనామా చేస్తానని చెప్పారని, కానీ మొత్తం ఏడు వాగ్దానాలనూ అమలు చేయలేదని తెలిపారు. మాట తప్పిన కల్పలతారెడ్డి వెంటనే రాజీనామా చేయాలని, లేనిపక్షంలో మోసం చేశామని అంగీకరించాలని తెలిపారు. ఇలాంటి వారు వైసిపి మిగతా 2లో

భూగోళమంతా వివక్ష


- వేతనాల్లోనూ భారీ వ్యత్యాసం
- ఐఎల్ఓ నివేదిక వెల్లడి

• చేద్దామన్నా మహిళలకు ఉద్యోగాలు లేవు


న్యూఢిల్లీ : ఎక్కడమ్మా నీవు లేనిది.... ఏమిటీ నీవు చేయలేనిది? అని పాడుకుంటాం కదూ! నిజమే.. అన్ని రంగాల్లోనూ మహిళలు దూసుకుపోతున్నారు. ఇంట్లో బండెడు చాకిరి చేయడంతో పాటు, బయట పనులు చేస్తే ఆర్థికంగా కుటుంబ భారాన్ని మోస్తున్నారు. నూతన ఆర్థిక విధానాల పుణ్యమా అని భార్య,భర్తలు ఇద్దరు రెక్కలు ముక్కలు చేసుకుంటేగానీ, ఇల్లు గడవని రోజులు వచ్చేశాయి. కానీ, ఉద్యోగాలు, ఉపాధి కల్పనలోనూ వివక్ష ఎదురవుతోంది. పనిచేయడానికి మహిళలు ముందుకు వస్తున్నప్పటికీ వారికీ ఉద్యోగాలు దొరకడం లేదు. అరకొర ఉపాధి కూడా అంతంతమాత్రంగానే ఉంది. పురుషుడు, మహిళ ఒక పనికి పోటీ పడితే మగవారిపట్లే మొగ్గు చూపుతున్నారు. అంతేకాదు. వేతనాల్లోనూ భారీ వ్యత్యాసం నెలకొంది. ఈ పరిస్థితి మనదేశంలోనే కాదు. ఒకటి, రెండు దేశాలు మినహా భూగోళమంతా ఇదే తరహా వివక్ష నెలకొంది. ఐక్యరాజ్యసమితికి చెందిన ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్ఓ) ఈ మేరకు రూపొందించిన నివేదిక అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

ప్రపంచవ్యాప్తంగా 15శాతం మంది...

ఐఎల్ఓ విడుదల చేసిన వివరాల ప్రకారం అన్ని అర్హతలు ఉండి, చేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రపంచవ్యాప్తంగా 15శాతం మంది మహిళలకు ఉద్యోగాలు దొరకడం లేదు. వివిధ విద్యార్హతలు, వయసుల వారిని గ్రూపులుగా చేసి ఐఎల్ఓ ఈ నిర్ధారణకు వచ్చింది. అదే సమయంలో ఈ తరహా నిరుద్యోగం (అర్హతలు ఉండి, పనిచేయడానికి ఆసక్తి కలిగిఉండటం) పురుషులలో 10.5శాతం మాత్రమే. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ తరహా నిరుద్యోగం మహిళల్లో 24.9శాతం ఉండగా, పురుషుల్లో 16.6శాతం ఉంది. అనేక సందర్భాల్లో విద్యార్హతలతో సబంధం లేకపోయినప్పటికీ పురుషులకు ఏదో ఒక ఉపాధి అవకాశం లభిస్తోంది. మహిళలకు మాత్రం అటువంటి అరకొర సంపాదన అవకాశం కూడా లభించలేదం లేదు.







అవే కారణాలు...!

అర్హతలు ఉన్నప్పటికీ పురుషులతో సమానంగా మహిళలకు ఉద్యోగాలు ఇవ్వకపోవడానికి ప్రపంచవ్యాప్తంగా ఒకే రకమైన సాకులు చెబుతున్నట్లు ఐఎల్ఓ పేర్కొంది. 'వారికి ఇంటి పని ఉంటుంది. సకాలంలో కార్యాలయాలకు రారు' అన్న మాట మన దేశంతో పాటు అనేక దేశాల్లో వినిపించింది. అయితే, వివిధ సంస్థలు నిర్వహించిన సర్వేల్లో పురుషులతో పోలిస్తే మహిళలే ఎక్కువ మంది సకాలంలో ఆఫీసులకు వస్తున్నారని తేలింది. ఆలస్యంగా వచ్చిన వారు కూడా పురుషులతో పోలిస్తే ఎక్కువ సమయం కార్యాలయాల్లోనే ఉండి పనులు చేస్తున్నారు. ప్రసూతి సెలవులు, పిరియడ్స్, పిల్లల పెంపకం వంటివాటిని కూడా మహిళలకు ఉద్యోగాలు, ఉపాధి నిరాకరించడానికి కారణాలుగా చెబుతున్నారు.

వేతనాలు తక్కువే!

ఉద్యోగాలు దొరకడమే కష్టంగా ఉంటే, దొరికిన ఉద్యోగాల్లోనూ పూర్తిస్థాయిలో మగవారితో సమానంగా వేతనాలు లభించడంలేదు. అభివృద్ధి చెందిన దేశాల్లోనూ ఈ తరహా వ్యత్యాసం ఉండటం గమనార్హం. సగటున పురుషుల ఒక డాలర్ సంపాదనకు మహిళలకు 51 సెంట్లు మాత్రమే లభిస్తోందని ఐఎల్ఓ పేర్కొంది. పేద దేశాల్లో ఈ తేడా మరింత భారీగా ఉంది. ఈ దేశాల్లో పురుషుల ప్రతి డాలర్ సంపాదనకు మహిళలకు 29 సెంట్లు మాత్రమే దక్కుతున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో పురుషుల ప్రతి డాలర్ సంపాదనకు మహిళలకు 58 సెంట్లు లభిస్తోంది. అంటే, అభివృద్ధి చెందామని చెప్పుకుంటున్న దేశాలు సైతం మహిళలకు సమాన హక్కులను దఖలు పరచడంలో విఫలమయ్యాయి. గతంలో పోలిస్తే అనేక దేశాల్లో లింగ అసమానత పెరుగుతోందని, దానిని తగ్గించి సమానత్వాన్ని సాధించాలన్న లక్ష్యం నీరుగారుతోందని ఐఎల్ఓ వ్యాఖ్యానించడం గమనార్హం.

భవిష్యత్‌లో కేరళలో సగానికి పైగా డాక్టర్లు మహిళలే !

కొజికోడ్ : రాబోయే దశాబ్దాల్లో కేరళలో సగానికి పైగా డాక్టర్లు మహిళలే వుండనున్నారు. రాష్ట్ర వార్షిక ఆర్థిక సమీక్ష ప్రకారం, కేరళ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ నిర్వహిస్తున్న మెడికల్ సైన్స్ సంబంధిత కోర్సులో 80 శాతానికి పైగా విద్యార్థులు యువతులే. ఇతర కోర్సుల కేటగిరీతో పోలిస్తే ఈ కోర్సుల్లో మహిళలే ఎక్కువగా వున్నారు. ఆధునిక మెడిసిన్ కోర్సుల్లో 2021-22 విద్యా సంవత్సరంలో 5,398 మంది విద్యార్థులు చేరగా, వారిలో 67శాతం అంటే 3616 మంది బాలికలే. జాతీయ సగటు 50శాతం కన్నా ఇది చాలా ఎక్కువగా వుంది. డెంటల్ కోర్సుల్లో మొత్తంగా 1907 మంది విద్యార్థులు వుండగా, వారిలో 1640 మంది బాలికలే. హోమియోపతి కోర్సు చేస్తున్న 385మంది విద్యార్థులుండగా, వారిలో 345మంది బాలికలే.

కొలువుదీరిన కొత్త ప్రభుత్వాలు

నాగాలాండ్‌లో నెఫ్యూ, మేఘాలయలో సంగ్మా ప్రమాణం

కోహిమా, షిల్లాంగ్ : ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు జరిగిన నాగాలాండ్, మేఘాలయలో మంగళవారం కొత్త ప్రభుత్వాలు కొలువుతీరాయి. నాగాలాండ్ ముఖ్యమంత్రిగా ఎన్‌డిపిపి నాయకులు నెఫ్యూ రియో వరుసగా ఐదోసారి ప్రమాణస్వీకారం చేయగా, మేఘాలయలో ఎన్‌పిపి అధ్యక్షులు కాన్రాడ్ కె. సంగ్మా రెండో పర్యాయం రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమా ణం చేశారు. వీరి ఇరువురి ప్రమాణ స్వీకార కార్యక్రమాలకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కేంద్ర మంత్రి అమిత్ షా, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, బిజెపి అధ్యక్షులు జెపి నడ్డా తదితర ప్రముఖులు హజరయ్యారు. బుధవారం త్రిపుర ముఖ్యమంత్రిగా మాణిక్ సాహా ప్రమాణస్వీకారం చేయనున్నారు.

నాగాలాండ్ రాజధాని కోహిమాలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ లా గణేశన్ నెఫ్యూ రియో చేత సిఎంగా ప్రమాణస్వీకారం చేయించారు. రియోతో పాటు పలువురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం చేశారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు తెమ్జెన్ ఇమ్నా అలోంగ్‌కు కేబినెట్‌లో మరోసారి చోటు దక్కింది. ఈ దఫా అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా ఇద్దరు మహిళలు విజయం సాధించారు. వీరిలో ఒకరైన సల్హౌతునో క్రుసెకు మంత్రి వర్గంలో స్థానం లభించింది. ఎన్‌డిపిపి తరఫున విజయం సాధించిన క్రుసె కేబినెట్ మంత్రిగా ప్రమాణం చేశారు. 72 ఏళ్ల నెఫ్యూ రియో నాగాలాండ్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం ఇది ఐదోసారి కావడం విశేషం. దీంతో నాగాలాండ్‌కు ఎక్కువకాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన రికార్డును రియో సొంతం చేసుకున్నారు. 2003లో రియో తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి 2008 వరకు కొనసాగారు. ఆ తర్వాత కొన్ని రోజుల పాటు రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించారు. మళ్లీ 2008లో మరోసారి రియో సీఎం పగ్గాలు అందుకున్నారు. 2013 ఎన్నికల తర్వాత మూడోసారి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు. అయితే ఏడాది తరువాత 2014 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఎంపి అయ్యారు. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి 2018 వరకు ఎంపిగా కొనసాగారు. 2018లో మళ్లీ రాష్ట్ర రాజకీయాల్లోకి వచ్చి ముఖ్యమంత్రి అయ్యారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిపిపి-బిజెపి కూటమి విజయం సాధించడంతో ఐదోసారి ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టారు.



ప్రధాని మోడీకి నెఫ్యూ అభివాదం



ప్రమాణస్వీకారం చేస్తున్న సంగ్మా

సంగ్మా రెండో సారి..

మేఘాలయలో కాన్రాడ్ కె. సంగ్మా వరుసగా రెండోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఫాగు చౌహన్ సంగ్మా చేత ప్రమాణస్వీకారం చేయించారు. సంగ్మాతో పాటు మరో 11 మంది ఎమ్మెల్యేలు కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేశారు. తాజా ఎన్నికల్లో ఎన్‌పిపికి 26 స్థానాలు వచ్చాయి. బిజెపి, యుడిపి వంటి మిత్రపక్షాలతో కలిసి సంగ్మా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.

31లోపు రూ.3,007 కోట్ల

పెండింగ్ బకాయిలు చెల్లిస్తాం

ఉద్యోగులతో చర్చల్లో ప్రభుత్వ అంగీకారం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉద్యోగులకు మార్చి 31 నాటికి పెండింగ్‌లోని బకాయిలకు సంబంధించి రూ.3,007 కోట్లను చెల్లించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. సరెండర్ లీవ్, డిఎ ఎరియర్స్‌కు సంబంధించి రూ.4,914 కోట్లు 3.9.2023లోపు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఉద్యోగులు కొంత కాలంగా డిమాండ్ చేస్తున్న పలు అంశాల్లో కొన్ని అంశాలకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. సచివాలయంలో మంగళవారం మంత్రివర్గ ఉపసంఘం, సిఎస్, ఆర్థికశాఖ అధికారులు, ఉద్యోగ సంఘాలతో సమస్యలపై చర్చించారు. ఉద్యోగులతో జరిగిన చర్చల్లో మంత్రులు బొత్స సత్యనారాయణ, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఆదిమూలపు సురేష్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి పాల్గొన్నారు. పిఆర్‌సి బకాయిలపై ప్రభుత్వం ఈ నెల 16న సిఎస్ అధ్యక్షతన ఆర్థికశాఖ అధికారులతో చర్చించి స్పష్టత ఇస్తామని మంత్రివర్గ ఉప సంఘం ఉద్యోగ సంఘాలకు హామీనిచ్చింది. సమావేశానంతరం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి ఆదిమూలపు సురేష్ మీడియాతో మాట్లాడారు. చాలాకాలంగా పెండింగ్‌లోని సమస్యలను కొలిక్కి తీసుకొస్తున్నామన్నారు. ఉద్యోగులు ప్రభుత్వంలో ఒక భాగమని, అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందంటే అందరూ కలిసికట్టుగా చేయడం వల్లే సాధ్యమన్నారు. కోవిడ్ వల్ల సమయానికి ఉద్యోగులకు చేయాల్సింది చేయలేకపోయామని, సమస్యలపై ఎప్పటికప్పుడు ఉద్యోగులతో చర్చిస్తున్నామని, పెండింగ్ బిల్లులన్నీ నెలాఖరులోగా పూర్తి చేయాలని సిఎం ఆదేశించినట్లు తెలిపారు. జిపిఎఫ్, గ్రాట్యుటీ, మెడికల్ బిల్లులు క్లియర్ చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు అన్నీ పూర్తి చేస్తామని సజ్జల, ఆదిమూలపు సురేష్ ప్రకటించారు. సమావేశం చివర్లో అధికారులతో వేరే సమావేశం ఉందంటూ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, వేరే పని ఉందంటూ ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అక్కడ నుంచి వెళ్లిపోయారు.

ఎపి ఎన్‌జిఒ సంఘం అధ్యక్షులు బండి శ్రీనివాసరావు మీడియాతో మిగతా 5లో

విశాఖలో చకచకా ఏర్పాట్లు

- విశాఖ, భీమిలిని విఐపి జోన్‌గా గుర్తించిన ప్రభుత్వం
- నివాసాలు చూసుకుంటున్న సిఎంఒ సిబ్బంది

మెటాలో మళ్లీ వేలాది సిబ్బందికి ఉద్వాసన..!

గంటల తరబడి లాలూ విచారణ

- సిబిఐ తీరుపై ఆయన కుమార్తెల ఆగ్రహం

● లోపలి పేజీలో.. ●



క్యాంప్ కార్యాలయంలో సిఎం జగన్‌ను కలిసిన మంత్రులు అమర్‌నాథ్, బుగ్గన, అధికారులు

18న ఫీజు రీయింబర్స్‌మెంటు

మార్చి, ఏప్రిల్‌లో కార్యక్రమాలపై సిఎం సమీక్ష


ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ నెల 18న సంపూర్ణ ఫీజు రీయింబర్స్‌మెంటు, జగనన్న విద్యాదీవెన లబ్ధిదారుల ఖాతాల్లోకి డిబిటి పద్ధతిలో నగదు జమ చేయనున్నట్లు సిఎం ప్రకటించారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై మంగళవారం తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం అధికారులతో సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియనున్నందున కార్యక్రమాలు ప్రారంభించాలని సూచించారు. కోడ్‌తో సంబంధం లేదని మధ్యాహ్న భోజనంలో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని 10వ తేదీన ప్రారంభించనున్నారు. ఈ నెల 14న అసెంబ్లీ సమావేశాల ప్రారంభం కానున్న నేపథ్యంలో వాటిపై చర్చించారు. ఈ నెల 22 ఉగాది రోజున ఉత్తమ సేవలందించిన వాలంటీర్ల పేర్లను ప్రకటించి ఏప్రిల్ 10న అవార్డులు, రివార్డులు అందజేయనున్నారు. 23న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. 31న వసతి దీవెన, ఏప్రిల్ 6న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలు చేస్తారు. ఏప్రిల్ 18న ఇబిసి నేస్తం అమలు చేయనున్నారు.

ఎయిర్ మిసైల్ ప్రయోగం విజయవంతం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

శత్రు నౌకలు, విమానాలను ధ్వంసం చేసే మీడియం రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్ (క్షిపణి)ను ఇండియన్ నేవీ విజయవంతగా ప్రయోగించింది. అరేబియన్ సముద్రంలో సోమవారం రాత్రి ఈ మిసైల్‌ను ప్రయోగిందింది. తూర్పు నౌకాదళానికి చెందిన మిసైల్ పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేయబడింది. డిఆర్‌డిఒ, ఐఎఐ, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ నుంచి ఈ క్షిపణి రూపుదిద్దుకుంది. ఆకాశంలో తిరిగే శత్రు దేశాలకు చెందిన విమానాలపై సముద్ర ఉపరితలం నుంచి బహుముఖ ఫైరింగ్ చేసి ధ్వంసం చేసే సామర్థ్యం దీనికి ఉంది. ఐఎన్ఎస్ విశాఖపట్నం పేరు మీద ఇండియన్ నేవీ దీన్ని రంగంలోకి దించింది. అరేబియన్ సముద్రంలో నిప్పులు చెరుగుతూ, గగనతలంలోకి దూసుకెళ్లింది. ఆత్మనిర్భర్ భారత్ అంకిత భావానికి ఇది నిదర్శనమని నావికాదళం ప్రకటించింది.



గగనతలంలోకి దూసుకెళ్తున్న మిసైల్

పడకేసిన 'పశుబీమా'!

- మూడేళ్లుగా రూ.200 కోట్లకు బ్రేక్
- రాష్ట్రంలో 84,469 క్లెయిములకు అందని పరిహారం
- ఉమ్మడి కడప జిల్లాలో రూ.10.19 కోట్లు పెండింగ్

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం పశుబీమా పథకాన్ని పడకెక్కించింది. 2020 మార్చి నుంచి బీమా పరిహారాన్ని చెల్లించడం లేదు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లో 84,469 పశువులకు సంబంధించి రూ.200.05 కోట్ల బకాయి ఉన్నాయి. క్లెయిములను పరిష్కరించాలని కోరుతూ పశుపోషకులు, రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం ఉండడం లేదు. దీంతో, వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పశువుల బీమా పరిహారాన్ని చెల్లించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, రైలు, రోడ్డు, ఇతర ప్రమాదాలు, లంపీస్కిన్ వంటి వ్యాధులు, సర్జరీల కారణంగా వేలాది పశువులు మరణిస్తున్నాయి. ఇటువంటి ఉపద్రవాల కారణంగా ఏటా పశుపోషకులకు, రైతులకు కోలుకోలేని దెబ్బ తగులుతోంది. ఈ దృష్ట్యా వారిని ఆదుకొనేందుకు ప్రవేశపెట్టిన పశుబీమా పథకానికి వైసిపి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. మూడేళ్ల నుంచి పశుబీమా పరిహారం చెల్లించడం లేదు. ఈ పథకాన్ని నిలిపివేసినట్లు ప్రచారం జరుగుతుండడంతో క్లెయిముదారులు ఆందోళన చెందుతున్నారు

ఉమ్మడి కడప జిల్లాలో 2020 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ 5,300 పశువులు మృతి చెందాయి. వీటికి సంబంధించి పశు బీమా పరిహారం కోసం రైతులు, పశుపోషకులు క్లెయిం చేశారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తర్వాతే క్లెయిములకు ఆమోదం తెలుపుతున్నారు. వీటిలో 52 దరఖాస్తులను తిరస్కరించారు. 875 పశువులకు సంబంధించి పరిహారం చెల్లించారు. 4,373 పశువులకు సంబంధించి 10.19 కోట్ల రూపాయలు పరిహారం బకాయి ఉంది. జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయం చుట్టూ క్లెయిముదారులు ప్రదక్షిణలు చేస్తోన్నా ఫలితం ఉండడం లేదు. పశువుల బీమా చెల్లింపుల నిలిపివేతపై ఇటీవల జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున గళమెత్తినా అధికారుల్లో స్పందన లేదు. ఉమ్మడి కడప జిల్లాలో 2020 నాల్గో త్రైమాసికంలో 875 పశువుల క్లెయిములకు సంబంధించి రూ.2.47 కోట్ల పరిహారం చెల్లింపునకు ప్రభుత్వం ఆమోదం తెలిపి జిల్లా పశుసంవర్ధక శాఖ ట్రెజరీ శాఖకు పంపించింది. ట్రెజరీలో ఆ మేరకు డబ్బులు లేకపోవడం, సాంకేతిక కారణాల వల్ల చెల్లింపులు జరగలేదు. ఇది ముఖ్యమంత్రి సొంత జిల్లా కావడం గమనార్హం.



చాపాడు మండలం మడూరులో మృతి చెందిన పశువు (ఫైల్)

త్వరలో చెల్లిస్తాం

పశువుల బీమా చెల్లింపులో ఆలస్యం మాట వాస్తవమే. వీటి క్లెయిములకు సంబంధించి రూ.2.47 కోట్లు ట్రెజరీకి పంపించాం. మిగిలిన రైతులకు త్వరలోనే పూర్తి స్థాయిలో చెల్లింపులు చేస్తాం

- సి.శారదమ్మ, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి, కడప

మహిళా దినోత్సవ శుభాకాంక్షలు గవర్నరు, సిఎం

ప్రజాశక్తి -అమరావతి బ్యూరో

మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నరు నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుకెళుతున్నారని పేర్కొన్నారు. సమాజాభివృద్ధిలో వారిపాత్ర కీలకమని వారందరికీ శుభాకాంక్షలు చెప్పారు. పర్యాటకశాఖ మంత్రి రోజా కూడా వేరొక ప్రకటనలో అభినందనలు తెలిపారు.

గ్లోబల్ సమ్మిట్ కాదు బోగస్ సమ్మిట్ : అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు ఓ బోగస్ సదస్సు అని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజారపు అచ్చెన్నాయుడు విమర్శించారు. మంగళవారం ఆయన ఒంగోలులో మీడియాతో మాట్లాడుతూ.. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు ద్వారా రూ.13 లక్షల కోట్లు పెట్టుబడులు సాధించామని సిఎం ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో పరిశ్రమల స్థాపన, పెద్ద ఎత్తున పెట్టుబడులు సాధించామని తెలిపారు. రాష్ట్రంలో గత నాలుగేళ్ల కాలంలో అభివృద్ధి పనులు చేపట్టకపోగా, వ్యవస్థలను సిఎం నిర్వీర్యం చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలలో అసంతృప్తి పెరుగుతోందన్నారు. వివేకానంద హత్య కేసులో సిఎం జగన్ తమ్ముడు అవినాష్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డి త్వరలోనే అరెస్టు అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం దొంగ ఓట్లు చేర్చి గెలవాలని చూస్తోందని విమర్శించారు.

కనిపించని పులి జాడ

- కూనలను తల్లి వద్దకు చేర్చేందుకు అధికారుల గాలింపు

ప్రజాశక్తి - కొత్తపల్లి (నంద్యాల)

నాలుగు కూనలను వదిలి వెళ్లిన పులి జాడ రెండోరోజూ కనిపించలేదు. పులి కోసం నల్లమల్ల అడవుల్లో ఫారెస్టు అధికారుల బృందం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టింది. సోమవారం రాత్రి నుంచి అడవి మొత్తం జల్లెడపట్టింది. పులి ఆచూకీ కోసం అడవిలో సుమారు 40 కెమెరాలను అమర్చింది. కూనలు క్షేమంగా ఉన్నప్పటికీ పులి ఆచూకీ మాత్రం కనిపించలేదని ఫారెస్టు డెవలప్‌మెంట్ అధికారి శ్రీనివాసరెడ్డి మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. పులి జాడ కోసం మరో వంద కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పులి జాడ తెలిస్తే వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వాలని రైతులను కోరారు.

సోము వీర్రాజుపై చర్యలు తీసుకోండి : కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మంగళగిరిలో జి వరప్రసాద్‌ను బెదిరించి భూమిని కబ్జా చేసిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, మీడియా కన్వీనర్ లక్ష్మిపతిరాజుపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు కెవిపిఎస్ పలు దళిత, ప్రజా సంఘాలతో కలిసి డిజిపి కార్యాలయంలో లా అండ్ ఆర్డర్ ఐజి అమ్మిరెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, దళిత హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, సీనియర్ న్యాయవాది సర్వేపల్లి సుదర్శనరావు, సమతా సైనిక్‌దళ్ అధ్యక్ష, కార్యదర్శులు పాలేటి మహేశ్వరరావు, పిల్లి సురేంద్రబాబు, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు సుధీర్, ఆలిండియా రైల్వే ఎస్‌సి, ఎస్‌టి ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి గోవింద్, బాధితులు వరప్రసాద్ తదితరులు ఐజిని కలిసిన వారిలో ఉన్నారు.

ఎపి గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా చందన నాగేశ్వర్

ప్రజాశక్తి - ధవళేశ్వరం(తూర్పుగోదావరి జిల్లా)


చందన నాగేశ్వర్

ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా చందన నాగేశ్వర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులను జారీ చేసింది. ఆయన ప్రస్తుతం వైసిపి రాజమహేంద్రవరం రూరల్ కో - ఆర్డినేటర్‌గా, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ చైర్మన్ ఉన్నారు. 2024 ఎన్నికల్లో వైసిపి రూరల్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఇప్పటికే ఆయనను ప్రకటించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వం తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని అన్నారు. ఈ పదవిని కట్టబెట్టిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

హమాలీల వేతనాలు పెంచాలి

- బేవరేజస్ ఎమ్‌డికి యూనియన్ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపిబిసిఎల్, ఐఎంఎఫ్ఎల్ డిపోల్లో పనిచేస్తున్న హమాలీలకు పెట్టెకు ఆరు నుండి తొమ్మిది రూపాయలు పెంచాలని ఎపిబిసిఎల్, ఐఎంఎఫ్ఎల్ డిపోస్ హమాలీ యూనియన్ కోరింది. ఈ మేరకు మంగళవారం బేవరేజస్ ఎమ్‌డికి నాయకులు కె ఉమామహేశ్వరరావు, సుబ్బారెడ్డి, పి ప్రసాద్ తదితరులు వినతిపత్రం సమర్పించారు. విదేశీ, ఇతర రాష్ట్రాల మద్యానికి పెట్టుకు ఏడు నుండి పది రూపాయలు వరకూ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'ప్రయాస్' ప్రాతిపదిక తప్పు

- రిపోర్టు ఇవ్వడం కుదరదు
- 2025 నాటికి అన్ని కనెక్షన్‌లకూ స్మార్ట్ మీటర్లు
- ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శ్రీకాకుళం జిల్లాలో ప్రయోగాత్మకంగా చేపట్టిన స్మార్ట్ మీటర్ల వినియోగానికి సంబంధించి ప్రయాస్ సంస్థ నివేదికను బయటకు ఇవ్వడం కుదరదని రాష్ట్ర ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ తెలిపారు. ప్రయాస్ సంస్థ తీసుకున్న ప్రాతిపదికను తప్పుగా తీసుకున్నందునే గందరగోళ పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకే స్మార్ట్ మీటర్ల ప్రాజెక్టును చేపట్టామన్నారు. విజయవాడలోని విద్యుత్ సౌధలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రయాస్ సంస్థ విద్యుత్ కొనుగోలు విలువ రూ.4.20ను తీసుకోవడం వల్ల తప్పు జరిగిందన్నారు. విద్యుత్ కొనుగోలు రేటు కాకుండా పంపిణీ రేట్ రూ.6.88ను తీసుకోవాల్సిందని తెలిపారు. వారు రెండేళ్ల క్రితం డేటాను తప్పుగా వేసుకున్నారన్నారు. ఈ పొరపాటు వల్లే ప్రయాగ్ సంస్థ నివేదికపై అపోహలు వస్తున్నాయన్నారు. తాము ఆ నివేదికను పూర్తిగా తప్పు పట్టడం లేదని, కేవలం డేటాను తీసుకోవడంలోనే పొరపాటు జరిగినట్లు భావిస్తున్నామని అన్నారు. నివేదికను తాము ఎలా ఇస్తామని అన్నారు. స్మార్ట్ మీటర్లపై అపోహలు వద్దని, విద్యుత్ రంగంలో ఇది విప్లవాత్మకమైన నిర్ణయమని అన్నారు. వ్యవసాయ రంగంతోపాటు గృహావసరాలకు, పరిశ్రమలకు కూడా స్మార్ట్ మీటర్లను పెడుతున్నామని, 2025 నాటికి పూర్తిగా అన్ని రకాల కనెక్షన్‌లకు స్మార్ట్ మీటర్లను పెడతామని వెల్లడించారు. రాష్ట్రంలో 16.66 లక్షల వ్యవసాయ కనెక్షన్‌లు ఉన్నాయని తెలిపారు. ఇందులో 11.97 లక్షల మంది రైతులకు బ్యాంకు ఖాతాలు ఉన్నాయని, ఇందులో 11.95 లక్షల మంది రైతులు అంగీకార పత్రాలు ఇచ్చారని చెప్పారు. విద్యుత్ ఖచ్చితత్వవినియోగం కోసమే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నామని రైతులపై ఎలాంటి భారం వుండదని అన్నారు. విద్యుత్ డిమాండ్ సప్లయ్‌పై ఖచ్చితత్వమైన అంచనా స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రతి 15 నిమిషాలకు ఒకసారి తెలుసుకోవచ్చున్నారు. అప్పుడు కొనడం, అమ్మడం వంటి విద్యుత్ మార్కెటింగ్ కూడా సులభతరమవుతుందన్నారు.

జవాబు తప్పయితే ఏం చేస్తారు?

- కానిస్టేబుళ్ల పరీక్షల కేసులో హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష ప్రశ్నాపత్రంలో జవాబు తప్పుగా నిర్ణయించినప్పుడు ఆ సమస్యను ఏవిధంగా పరిష్కరిస్తారో అనుసరించే విధానం గురించి చెప్పాలని రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డుకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పూర్తి వివరాలను నివేదించాలని జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష ప్రిలిమ్స్‌లో 8 ప్రశ్నలకు సరైన జవాబులను నిర్ణయించలేదని, ఈ అంశాన్ని నిపుణుల కమిటీకి నివేదించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలను హైకోర్టు మంగళవారం విచారణ జరిపింది.

దేహదారుఢ్య పరీక్షకు అనుమతించేలా రిక్రూట్‌మెంట్ బోర్డుకు ఉత్తర్వులు ఇవ్వాలంటూ జలగం సహజ సహా 80 మంది వేసిన వ్యాజ్యాలపై విచారణను ఈ నెల 9కి వాయిదా వేసింది.

బ్యాంకు లావాదేవీలను స్తంభింపజేయవచ్చు

టిడిపి నేత జెసి ప్రభాకర్‌రెడ్డి బినామీల బ్యాంకు ఖాతాల లావాదేవీలను స్తంభింపజేసే అధికారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)కి ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. ఇడి చర్య చట్టబద్ధమేనని చెప్పింది. మనీలాండరింగ్ చట్ట నిబంధనల్లోని సెక్షన్ 17 ప్రకారం చర్యలు తీసుకోవచ్చునని తెలిపింది. సుప్రీం కోర్టు నిషేధించిన బిఎస్-3 వాహనాలను అశోకా లైలాండ్ నుంచి తుక్కు కింద కొనుగోలు చేసి, వాటిని బిఎస్-4 వాహనాలుగా మార్పు చేసి రూ.కోట్లు మేరకు మోసానికి పాల్పడ్డారనే కేసులో ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అనుచరుడు, బినామీగా ఆరోపణలు ఎదుర్కొంటున్న చవ్వా గోపాల్‌రెడ్డి కుమారుడు, భార్య పేరు మీద యాక్సిస్, యూనియన్ బ్యాంకుల ఖాతాల నుంచి 15 రోజులపాటు ఎలాంటి నగదు లావాదేవీలు నిర్వహించడానికి వీల్లేదని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ రవినాథ్ తిల్హరీ మంగళవారం తుది ఉత్తర్వులు జారీ చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసే అధికారం తమకు ఉంటుందన్న ఇడి వాదనను ఆమోదిస్తూ తీర్పు చెప్పారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

- సిఎం, మంత్రికి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని, తెలంగాణ కన్నా అదనపు వేతనం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ముఖ్యమంత్రిని, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రిని కోరింది. ఈ మేరకు యూనియన్ ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ, అధ్యక్షులు జి బేబీరాణి మంగళవారం వారికి లేఖ రాశారు. అంగన్‌వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, ఫేస్‌యాప్ రద్దుచేయాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని కోరారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాసును ప్రభుత్వమే సరఫరా చేయాలని, 2017 నుండి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలని కోరారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.ఐదు లక్షలు, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని లేఖలో పేర్కొన్నారు. హెల్పర్లకు వయో పరిమితి 50 ఏళ్లకు పెంచాలని, ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలని కోరారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయడంతోపాటు ఆయిల్, కందిపప్పు క్వాంటిటీ పెంచాలని, సీనియారిటీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని కోరారు. గ్రేడ్-2 సూపర్‌వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలన్నారు. అంగన్‌వాడీలకు జాబ్ క్యాలెండర్ నిర్ణయించాలని, మధ్యాహ్నం ఒంటిగంటలోపు కేంద్రాలను విజిట్ చేయరాదని, వేతనంతో కూడిన మెడికల్ లీవు సదుపాయం కల్పించాలని కోరారు. సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, బీమా అమలు చేయాలని కోరారు.

ఆర్‌టిసికి 2,736 కొత్త బస్సులు

- ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఒకేసారి 2,736 బస్సులు కొనుగోలు చేయనున్నట్లు ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు వెల్లడించారు. ఇందులో దూర ప్రాంతాలకు డీజిల్‌తో నడిచే ఎసి, నాన్ ఎసి బస్సులు 1500 ఉన్నాయని, మరో వెయ్యి బస్సులను జిసిసి మోడల్ విద్యుత్ బస్సులని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పథకంతో 200 డీజిల్ బస్సులను విద్యుత్ బస్సులుగా మారుస్తామని, మొత్తం 2,736 బస్సులు ఈ ఏడాది ఆర్‌టిసికి రానున్నాయని పేర్కొన్నారు. ఆర్‌టిసి హౌస్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఆర్‌టిసికి సొంత బస్సులు కొనుగోలుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని తెలిపారు. ఇందుకోసం రూ.572 కోట్లు ఖర్చవుతుందని అన్నారు. కర్ణాటక తరహాలో రాష్ట్రంలో కూడా 15 మీటర్ల అంబారీ బస్సులను నడిపేందుకు ప్రణాళిక తయారు చేస్తున్నామన్నారు. కేంద్రం ప్రకటించిన 15 ఏళ్ల కాలపరిమితి స్క్రాప్ పాలసీ కిందికి ఆర్‌టిసిలో కేవలం 221 బస్సులే వస్తాయని, వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టామన్నారు. అంతర్రాష్ట్ర సర్వీసులపై ఒడిశా, కర్ణాటకతో ఒప్పందాలు పూర్తయ్యాయని చెప్పారు. తెలంగాణలో మరిన్ని సర్వీసులు నడిపేందుకు చర్చలు జరుపుతున్నామని తెలిపారు.

తమిళనాడుకు సర్వీసులు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డీజిల్ కొనుగోళ్లలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయనే ప్రచారం సరైంది కాదన్నారు. కేంద్రం సరఫరా చేసే బల్క్ డీజిల్ సరఫరా ధరను రీటైల్ మార్కెట్‌కు మించి పెంచడంతో ఆర్‌టిసి ఎక్కడ తక్కువకు డీజిల్ దొరికితే అక్కడ నుండి తీసుకోవచ్చనే విధాన నిర్ణయాన్ని తీసుకుందని తెలిపారు. ఎపిఎస్‌ఆర్‌టిసి సగటున ఏడాదికి 27 కోట్ల లీటర్ల డీజిల్‌ను వినియోగిస్తోందన్నారు. 2018 నుంచి 2021 వరకూ కేంద్రం ఇచ్చే డీజిల్‌పై లీటరుకు రూ.1.94 చొప్పున తక్కువకు సరఫరా చేసేవారని అన్నారు. ఆ తర్వాత కేంద్రం ధరను పెంచడంతో రీజనల్ మేనేజర్ల ఆధ్వర్యాన ఒక కమిటీని ఏర్పాటుచేసి డిపోలవారీ ఎవరు తక్కువకు ఇస్తే వారి నుండి డీజిల్‌ను తీసుకునేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కేంద్రం మళ్లీ బల్క్ డీజిల్ ధరను తగ్గించడంతో మళ్లీ కొత్తగా టెండర్లను పిలిస్తే లీటర్‌కు రూ.5.87 తక్కువకు సరఫరా చేసేందుకు కంపెనీలు ముందుకు వచ్చాయని చెప్పారు. 2025 వరకు ఈ రేట్‌కు కంపెనీలు సరాఫరా చేస్తాయని అన్నారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యం

- మహిళా దినోత్సవ వేడుకల్లో డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళగిరిలోని పోలీస్‌హెడ్ క్వార్టర్స్‌లో ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో మహిళా పోలీసులతో ప్రత్యేక కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. దీనికి డిజిపి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయడంలో పోలీసుల పాత్ర చాలా గొప్పగా ఉందన్నారు. మహిళలపై జరిగే నేరాల ఫిర్యాదుల కోసం దిశ పోలీస్ స్టేషన్‌లను, వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకు దిశ యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. దిశ మొబైల్ అప్లికేషన్ అత్యంత ఆధునిక టెక్నాలజీతో ఆపదలో ఉన్న మహిళలకు రక్షణ కల్పిస్తోందన్నారు. దిశ యాప్‌లో మొత్తం 1,11,46,452 మంది రిజిస్ట్రేషన్ చేసుకోవడం ఒక గొప్ప విశేషమని అన్నారు. మహిళా కానిస్టేబుల్ వ్యవస్థ ద్వారా క్షేత్రస్థాయి నుంచి మంచి ఫలితాలను మహిళలు పొందుతున్నారన్నారు. మహిళా పోలీసుల ద్వారా ముందస్తు సమాచారం పోలీస్ స్టేషన్లకు చేరడంతో మహిళలపై జరిగే అత్యాచారాల నిరోధం సులువైందని అన్నారు. పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎఫ్ఎస్ఎల్ సాంకేతిక విభాగంలో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహిళా సిబ్బందికి బహుమతులను డిజిపి అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిజి రవిశంకర్ అయ్యన్నార్, సిఐడి అడిషనల్ డిజి ఎన్ సంజయ్, డిఐజి రాజకుమారి, టెక్నికల్ సర్వీసెస్ డిఐజి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలు కల్పిస్తే.. విశ్వంలోనే వీర వనిత

- హైకోర్టు సిజె జస్టిస్ పికె మిశ్రా

ప్రజాశక్తి-అమరావతి

మహిళలకు సమాన ప్రాధాన్యత ఇచ్చినప్పుడే ఏ దేశమైనా పురోగతి సాధిస్తుందని, లేకపోతే సమాజ సాధ్యం కాదని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పికె మిశ్రా అన్నారు. మహిళలకు సరైన స్థానం కల్పిస్తే విశ్వంలోనే అగ్రస్థాయిలో భారత్ ఉంటుందన్నారు. ఉన్నత పదవుల్లో మహిళల సంఖ్య పెంపు అవసరమన్నారు. రాష్ట్రపతి, గవర్నర్లు, సుప్రీం కోర్టు, హైకోర్టు జడ్జిలుగా మహిళలు పెద్ద సంఖ్యలోనే వచ్చారని గుర్తు చేశారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం హైకోర్టు న్యాయవాదుల సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ.. గతంలో తక్కువగా ఉన్న హైకోర్టు మహిళా జడ్జిలు ఇప్పుడు 28 శాతానికి పెరిగారని చెప్పారు. ఇతర శాఖల్లోనూ మహిళల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఏ స్థాయిలోనూ ఆత్మస్థైర్యం కోల్పోకూడదని మహిళా న్యాయమూర్తులు జస్టిస్ బి శ్రీభానుమతి, జస్టిస్ వడ్డిబోయన సుజాత అన్నారు. వాయిదాలు అడిగే వరకే పరిమితం కాకుండా కేసులను అందిపుచ్చుకుని వాదించే స్థాయికి ఎదగాలన్నారు. మహిళా న్యాయమూర్తులతోపాటు సీనియర్ న్యాయవాది భాస్కరలక్ష్మిని న్యాయవాదుల సంఘం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయి, సంఘం అధ్యక్షులు కె జానకిరామిరెడ్డి, అడ్వకేట్ జనరల్ ఎస్ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై నిర్లక్ష్యం సహించను : రాజన్నదొర

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గిరిజన విద్యా సంస్థల్లో చదువుకునే పిల్లల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర హెచ్చరించారు. గిరిజన విద్యా సంస్థల్లో విద్యార్థుల సంరక్షణకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో అధికారులతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. గతంలో ఉన్న ఎఎన్ఎంల సేవలను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 590 మంది ఎఎన్ఎంలను నియమించడంతోపాటు ఆయా పాఠశాలల పరిధిలోని సచివాలయాల్లో ఉండే ఎఎన్ఎంలతో గిరిజన విద్యార్థులను ముందుగా మ్యాపింగ్ చేయాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో సమన్వయం చేసుకుని ఆరోగ్య పరీక్షలను ఎప్పటికప్పుడు చేయించాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో అన్ని స్థాయిల్లోని అధికారులు తక్షణమే స్పందించి విద్యార్థులను ఆస్పత్రులకు చేర్పించి చికిత్స చేయించాలన్నారు. భద్రత నేపథ్యంలో సిసి కెమెరాలకు రిపేర్లు చేయించాలని, లేనిచోట్ల ఏర్పాటు చేయాలని సూచించారు. పదో తరగతిలో మంచి ఫలితాలు వచ్చేలా చూడాలన్నారు. చింతపల్లిలోని ఎస్‌టి డిగ్రీ కళాశాలకు సదుపాయాలు, సీతంపేటలోని జిఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలకు భవనాలను నిర్మించడానికి చర్యలు చేపట్టాలన్నారు. మాతృభాషా వాలంటీర్లకు వేతనాలు సక్రమంగా చెల్లించాలన్నారు. కాఫీ రైతుల బకాయిలు చెల్లించాలని, ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని జిసిసి అధికారులను కోరారు.

అగ్నిప్రమాదంలో 21 ఇళ్లు దగ్ధం

- కట్టుబట్టలతో గిరిజనులు
- రూ.కోటి ఆస్తినష్టం

ప్రజాశక్తి - వేలేరుపాడు (ఏలూరు జిల్లా)

ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలో మంగళవారం ఘోర అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గిరిజన కన్నయ్యగుట్టలోని ఓ ఇంట్లో నుంచి చెలరేగిన మంటలకు 21 ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఫైర్ సిబ్బంది, స్థానిక ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం... కన్నయ్యగుట్ట గ్రామంలోని కారం నారాయణ అనే వ్యక్తి ఇంటి నుంచి మంటలు ఎగసిపడ్డాయి. ఎండ తీవ్రత, గాలి వీయడంతో మంటలు క్షణాల్లో పక్కనే ఉన్న ఇళ్లకు వ్యాపించాయి. గ్రామంలో అందరూ పొలం పనులకు వెళ్లిన సమయంలో ప్రమాదం జరగడంతో ఇళ్లన్నీ పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఇళ్లలోని ధాన్యం, మినుములు, బంగారం, నగదు, మోటారు సైకిళ్లు, ఇతర సామగ్రి దగ్ధమయ్యాయి. ఫైరింజన్ వచ్చేసరికి ఇళ్లన్నీ పూర్తిగా కాలిపోయాయి. దీంతో 27 కుటుంబాలు కట్టుబట్టలతో రోడ్డున పడ్డాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లగానీ, గ్యాస్ సిలిండర్ పేలడం వల్లగానీ ప్రమాదం సంభవించి ఉంటుందని ఫైర్ సిబ్బంది తెలిపారు. ఈ ప్రమాదంలో ఆస్తి నష్టం రూ.కోటి ఉంటుందని అంచనా వేస్తున్నారు. అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయి బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుని వారికి న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, మండల కార్యదర్శి ధర్ముల రమేష్ డిమాండ్ చేశారు.

ప్రాజెక్టుల అమలుకు 2 కమిటీలు : రోజా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖపట్నంలో ఈ నెల 3, 4 తేదీల్లో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రాష్ట్ర పర్యాటక రంగానికి సంబంధించి రూ.21,941 కోట్ల పెట్టుబడులతో 129 ఒప్పందాలు జరిగాయని, వీటి ద్వారా 41,412 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని రాష్ట్ర పర్యాటక, క్రీడలు, సాంస్కృతికశాఖ మంత్రి ఆర్‌కె రోజా పేర్కొన్నారు. సమ్మిట్ సక్సెసైనట్లు సచివాలయంలో మంగళవారం ఆమె కేక్‌ను కట్ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎంఒయులు అయిన ప్రాజెక్టులకు సంబంధించి గ్రౌండ్ అయ్యేలా చూసేందుకు రెండు కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేనంతగా పెద్ద పారిశ్రామికవేత్తలు ఈ సదస్సుకు హాజరయ్యారన్నారు. పర్యాటక, సాంస్కృతికశాఖ స్పెషల్ సిఎస్ రజత్ భార్గవ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సమావేశంలో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎమ్‌డి కన్నబాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్ మల్‌రెడ్డి పాల్గొన్నారు.

జర్నలిస్ట్ రాజేశ్వరరావు మృతి తీరని లోటు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పలు పత్రికల్లో వివిధ హోదాల్లో పనిచేసిన సీనియర్ జర్నలిస్టు సిహెచ్ రాజేశ్వరరావు మృతి జర్నలిస్టు ఉద్యమానికి తీరని లోటని నేషనల్ అలయన్స్ జర్నలిస్ట్ ప్రధాన కార్యదర్శి ఎన్ కొండయ్య, కోశాధికారి ఎ అమరయ్య, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ వెంకట్రావ్, జి ఆంజనేయులు, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి శ్రీనివాసరావు, నాయకులు కె మునిరాజు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.


కేసు కొట్టివేత అనంతరం న్యాయవాదితో సిపిఎం, ప్రజా సంఘాల నేతలు

సిపిఎం నాయకులపై పోలీసు కేసు కొట్టివేత

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖపట్నంలో అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు, పట్టాలు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన 2006లో కలెక్టరేట్ వద్ద జరిగిన ఆందోళన సందర్భంగా 18 మంది నేతలపై పెట్టిన పోలీసు కేసులను విశాఖ చీఫ్ మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ కోర్టు మంగవారం కొట్టివేసింది. 2006 ఫిబ్రవరి 28న వేలాది మందితో కలెక్టరేట్ వద్ద ఆందోళన జరిగింది. దీన్ని సహించలేని నాటి రాష్ట్ర ప్రభుత్వం అరెస్టులకు పాల్పడి 18 మంది సిపిఎం నాయకులపై పోలీసు కేసులు బనాయించింది. ఆ పోరాటం వృథా కాలేదు. ప్రజల నిరసనకు ప్రభుత్వం తలొగ్గి అర్హులకు రేషన్ కార్డులు, ఇళ్ల పట్టాలు, స్కీం ఇళ్లు మంజూరు చేసింది. వేలాది మంది పేదలు, ప్రజలు లబ్ధి పొందారు. తరువాత వచ్చిన ప్రతిపక్ష ప్రభుత్వం కూడా ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు, రేషన్ కార్డులు మంజూరు చేయాల్సి వచ్చింది. నాడు ప్రభుత్వం పెట్టిన పోలీసు కేసు వల్ల సిపిఎం నేతలు 17ఏళ్లపాటు కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చింది. ఈ కేసును ప్రముఖ న్యాయవాది ఎన్.వెంకటేశ్వరరావు వాదించారు. చీఫ్ మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ ఈ కేసును విచారించారు. నాయకులపై పోలీసులు పెట్టిన అభియోగాలు రుజువు కాకపోవడంతో సిఎంఎం కోర్టు మెజిస్ట్రేట్ సిపిఎం నాయకులను నిర్దోషులుగా నిర్ధారించి కేసును కొట్టి వేశారు. ఈ అక్రమ కేసు నుంచి విముక్తి అయిన వారిలో ప్రస్తుత సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, విశాఖ జిల్లా అధ్యక్షులు బి.పద్మ, 78వ వార్డు కార్పొరేటరు డాక్టర్ బి.గంగారావు, సిఐటియు జిల్లా నాయకులు ఎం.సుబ్బారావు, బి.వెంకటరావు, జి.అప్పలరాజు, జి.పోలేశ్వరరావు, అనపర్తి అప్పారావు, డి.ప్రకాష్, కె.రాజేష్, తాతబాబు, నజీర్, బి.అనంతలక్ష్మి ఉన్నారు. కాగా, ప్రభుత్వాలు మారినా నిర్బంధ విధానాలు మాత్రం మారలేదు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అక్రమాలు: చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మూడు స్థానాలకు జరుగుతున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బోగస్ ఓట్లతో వైసిపి అక్రమాలకు పాల్పడుతోందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. గ్రాడ్యుయేట్ ఎన్నికలపై చంద్రబాబు అన్ని నియోజకవర్గాల ఇన్‌ఛార్జులతో మంగళవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. టిడిపి నిలబెట్టిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎన్నికల్లో అక్రమాలకు అలవాటుపడిన వైసిపి బోగస్ ఓట్లతో గెలిచేందుకు కుట్ర చేస్తోందని పేర్కొన్నారు. ఇప్పటికే పెద్దఎత్తున బోగస్ ఓట్లు బయటపడ్డాయని వివరించారు. పట్టభద్రులు కానివారి ఓట్లు బయటపడ్డాయని వివరించారు. తప్పుడు పత్రాలతో ఓట్లు పొంది నీచమైన చర్యలకు పాల్పడుతున్నారన్నారు. అర్హత లేకుండా ఓట్లు వేసే వారు శిక్షార్హులు అవుతారని గుర్తించాలన్నారు. బోగస్ ఓట్లపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతోపాటు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయాలని నాయకులకు చంద్రబాబు సూచించారు. బోగస్ ఓట్లు, ప్రలోభాలతో ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో రెండో ప్రాధాన్యత ఓటు కీలకంగా మారుతుందని, ఆ ఓటు టిడిపి అభ్యర్థికి పడేలా చూడాలని కోరారు. ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ అభ్యర్థి చిరంజీవిరావు, తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్, పశ్చిమ రాయలసీమ అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి గెలుపు కోసం పార్టీ నేతలు కృషి చేయాలని కోరారు.

'ఉక్కు'ను ప్రయివేటీకరిస్తే ఊరుకోం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరిస్తే ఊరుకునేది లేదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 754వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ సిఐ అండ్ సిసిపి విభాగానికి చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరాం, వరసాల శ్రీనివాసరావు, విల్లా రామ్మోహన్‌కుమార్ మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంట్‌ను అస్థిరపరిచేందుకు కేంద్రం అనేక కుట్రలకు పాల్పడుతోందన్నారు. అయినా, రాష్ట్రంలోని అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు చోద్యం చూడడం తగదని విమర్శించారు.

ఉద్యోగులను మోసం చేసిన వైసిపికి ఓటు అడిగే అర్హత లేదు

(మొదటిపేజి తరువాయి)

అభ్యర్థుల తరుపున ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

నెల్లూరు నుండి వైసిపి అభ్యర్థిగా ఉన్న శ్యాంసుందరరెడ్డి సారా అక్రమ రవాణా, దొంగ లేబుల్స్ వేశారన్న అభియోగాలపై కేసులు ఎదుర్కొంటున్నానని స్వయంగా అఫిడవిట్ దాఖలు చేశారంటూ ఆ కాపీ మీడియాకు ప్రదర్శించారు. ఇలాంటి మాఫియాలు పెద్దల సభకు ప్రతినిధిగా ఇప్పుడు ఓట్లు అడుగుతున్నారని, ఏం ముఖం పెట్టుకుని వస్తారని ప్రశ్నించారు. అడిగేందుకు ఆయనకు సంస్కారం లేకపోయినా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఉందని వారు కీలెరిగి వాత పెడతారని హెచ్చరించారు. ఒక్క సమస్యనైనా పరిష్కరించలేని వైసిపికి ఓటు వేయడం తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి భంగకరమని తెలిపారు. ఉపాధ్యాయులను గౌరవించే సంస్కృతి వైసిపికి లేదన్నారు.

రకరకాల యాప్‌ల పేరుతో టీచర్లపై తీవ్రస్థాయిలో ఒత్తిడి పెంచుతున్నారని, దీనివల్ల కొందరు ఒత్తిడికి లోనై చనిపోతున్నారని తెలిపారు. బాపట్ల జిల్లాలో జరిగిన తాజా ఘటన ప్రస్తావించారు. ఈ కాలంలో ఒత్తిడికి లోనై ఐదుగురు టీచర్లు బలయ్యారని చెప్పారు. కరోనా మూలంగా 35 మంది టీచర్లు ప్రాణాలు వదిలారని తెలిపారు. బైజూస్‌కు సేవ చేయకపోతే విద్యాశాఖ కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ రంగంలోకి దిగుతారని, ఉపాధ్యాయులను నోటీసుల రూపంలో వేధిస్తూ, హింసిస్తున్నారని అన్నారు. ఉద్యోగులు దాచుకున్న పిఎఫ్ డబ్బు మూడువేలకోట్లను వాడుకునేందుకూ ఉద్యోగులకు అవకాశం లేకుండా చేశారని, ప్రభుత్వమే వాడుకుందని వివరించారు. జీతాలూ సకాలంలో ఇవ్వడం లేదన్నారు. ప్రైవేటు స్కూల్ టీచర్లకైతే అసలు భద్రతే లేదని పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై మార్చి 9, 10 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా మండల కేంద్రాల్లో ధర్నాలు చేస్తున్నామని వివరించారు. ప్రైవేటు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ చట్టం తేవాలని కోరారు. చిన్న స్కూళ్లపై వేధింపులు ఆపాలని డిమాండు చేశారు. గ్లోబల్ సమ్మిట్ పెట్టి పెట్టుబడిదారులకు రాయితీల వర్షం కురిపించారని, అదే పాలకులు చిన్న స్కూళ్లను వేధించి డబ్బులు పిండుతున్నారని చెప్పారు.

వైసిపికి ఓటు - ఉద్యోగులకు చేటు : రామకృష్ణ

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ట్రేడ్ యూనియన్లు కీలకంగా వ్యవహరించే శాసనమండలి ఎన్నికల్లో అధికార వైసిపి నేరుగా జోక్యం చేసుకుని గెలవాలని కిందిస్థాయి ప్రజాప్రతినిధులకు సిఎం స్థాయిలో ఆదేశాలు జారీచేయడం సరైంది కాదని అన్నారు. గతంలో వైఎస్ఆర్‌గానీ చంద్రబాబుగానీ శాసనమండలి టీచర్ ఎన్నికల్లో నేరుగా జోక్యం చేసుకోలేదని, జగన్ జోక్యం చేసుకోవడంతోపాటు గెలవాలని ఆదేశాలు జారీచేస్తున్నారని మండిపడ్డారు. ఓటుకు మూడువేలా, ఐదువేలా, పదివేలా ఎంత పంచాలనే అంశంపై చర్చలు జరుపుతున్నారని, విద్యావంతుల నియోజకవర్గాల్లోనూ ఇలా డబ్బులు పంచి గెలవాలనుకోవడం అవివేకమని తెలిపారు. రాయలసీమలో ప్రతాపరెడ్డి, ఉత్తరాంధ్రలో ఆంధ్రా యూనివర్శిటీ విసి నేరుగా రాజకీయ నాయకులతో కూర్చుని వైసిపిని గెలిపించాల్సిందేనని ఆదేశిస్తున్నారని వారిపై తీవ్ర చర్యలకు తీసుకోవాలన్నారు. దీనిపై వామపక్ష కార్యకర్తలు పట్టుకుంటే ప్రసాదరెడ్డి బాత్‌రూములో దాక్కున్నాడని ఇంత కంటే సిగ్గుచేటు మరొకటి లేదని వివరించారు. శాసనమండలిలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రశ్నించే పిడిఎఫ్ సభ్యులు లేకుండా చేయాలనే ఉద్దేశంతోనే జగన్ ఇటువంటి చర్యలకు దిగారని విమర్శించారు. రాయలసీమ వెస్ట్‌లో 150 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం ఉందని పేర్కొన్నారు. ప్రజలకు, రాష్ట్రానికి, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఉపయోగపడని వైసిపి, బిజెపి అభ్యర్థులను ఈ ఎన్నికల్లో ఓడించాలని కోరారు.



కృష్ణజింకను స్టేషన్‌కు తీసుకువచ్చిన స్థానికులు

జనావాసంలోకి కృష్ణజింక

ప్రజాశక్తి- పిచ్చాటూరు (తిరుపతి జిల్లా)

తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండల కేంద్రంలో మంగళవారం ఉదయం కృష్ణ జింక ప్రత్యక్షమయ్యింది. తాగునీటి కోసం అడవి నుంచి దారితప్పి పిచ్చాటూరులోని బజారువీధికి వచ్చింది. కుక్కలు వెంటబడటంతో తోపువీధి వైపు పరుగులు తీస్తూ ఓ ఇంటి వద్ద అమర్చిన ఫెన్సింగ్ కమ్మీలకు జింక తల ఇరుక్కుపోయింది. అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి జింకను రక్షించారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. జింకకు స్థానిక పశు వైద్యాధికారులు వైద్యం చేసి అటవీ అధికారులకు అప్పగించారు.

కబడ్డీ ఆడుతూ కుప్పకూలిన విద్యార్థి

- చికిత్స పొందుతూ మృతి

ప్రజాశక్తి-మడకశిర రూరల్ (సత్యసాయి జిల్లా)



తనుజా నాయక్ (ఫైల్)

స్నేహితులతో సరదాగా కబడ్డీ ఆడుతూ ఓ విద్యార్థి ఆట స్థలంలోనే కుప్పకూలాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతను ఆరు రోజుల పాటు చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచారు. మృతుని కుటుంబ సభ్యుల కథనం ప్రకారం..శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండలం అచ్చంపల్లి తండాకు చెందిన తనుజా నాయక్ (19) అనంతపురం జిల్లా కేంద్రంలోని పివికెకె ఫార్మసీ కళాశాలలో బిఫార్మసీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఈ నెల ఒకటిన కళాశాల ప్రాంగణంలో మిత్రులతో కలిసి కబడ్డీ ఆడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతన్ని వెంటనే అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందారు. చదువుకునేందుకు వెళ్లిన కుమారుడు మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

విశాఖలో చకచకా ఏర్పాట్లు

- విశాఖ, భీమిలిని విఐపి జోన్‌గా గుర్తించిన ప్రభుత్వం
- నివాసాలు చూసుకుంటున్న సిఎంఒ సిబ్బంది



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖలో సిఎం క్యాంపు కార్యాలయం ఏర్పాటుకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. విశాఖ నుంచి పాలన చేసే అంశంపై ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే సిఎం ప్రకటించనున్నారని సమాచారం. ఉగాది తర్వాత అక్కడ నుండే పరిపాలన జరగనుంది. దీనికోసం స్థానిక అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రిషికొండ, భీమిలికి ఆనుకుని ఉన్న ప్రాంతాలను ప్రభుత్వం విఐపి జోన్‌గా గుర్తించినట్లు తెలిసింది. రిషికొండపై ఏర్పాటు చేసే భవనాల్లోనే సిఎంఒ ఉండనుంది. దానికి ఆనుకుని ఉన్న నిర్మాణాల్లోనే సిఎంఒ అధికారులు, కొన్ని ప్రధాన విభాగాల హెచ్‌ఒడిలు ఏర్పడనున్నాయి. భీమిలి, విశాఖపట్నం మధ్యలో అన్ని ప్రాంతాలనూ కలిపే విధంగా రవాణా వ్యవస్థనూ ఏర్పాటు చేయనున్నారు. అత్యవసరం అయితే కొన్ని కార్యాలయాలను ఆంధ్రా యూనివర్సిటీకి సంబంధించిన భవనాల్లోనూ పెట్టే అవకాశం ఉందని తెలిసింది. సుప్రీం కోర్టు, హైకోర్టులో కేసులు ఉన్న నేపథ్యంలో పరిపాలనా రాజధానిపై పూర్తిస్థాయి ప్రకటన, స్పష్టత ఇవ్వకపోయినా సిఎంఒను మాత్రం విశాఖలో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే విశాఖ బీచ్‌రోడ్డు, ఇతర రోడ్లనూ అభివృద్ధి చేస్తున్నారు. భీమిలి వరకూ ఎటువంటి అడ్డంకులూ లేకుండా రవాణా సదుపాయం ఏర్పాటు చేశారు. రిషికొండకు ఆనుకుని ఉన్న భవనాలను కార్యాలయాలుగా, అధికారుల నివాస ప్రాంతాలుగా ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగానే సిఎంఒలో పనిచేసే సిబ్బంది ఇప్పటికే విశాఖలో నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. పలువురు ఇప్పటికే అక్కడకు వెళ్లి వచ్చారు. ప్రస్తుతం రిషికొండపై జరుగుతున్న నిర్మాణాల్లోనే సిఎంఒ ఉండొచ్చని, దానికి ఆనుకుని ఉన్న నిర్మాణాల్లో పలువురు ఉన్నతాధికారుల కార్యాలయాలు ఉంటాయని తెలిసింది. పరిపాలనకు సంబంధించి పలు విభాగాల కార్యాలయాలు అమరావతిలోనే ఉంటాయని, కొన్నిటిని మాత్రమే విశాఖ తరలిస్తారనే ప్రచారం జరుగుతోంది. కార్యాలయాలు తరలిస్తే ఖర్చు హెచ్‌ఒడిల నుండి వసూలు చేస్తామని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో వారు కూడా ఆందోళనలో ఉన్నారు. దీన్నుండి బయటపడేందుకు అమరావతి కేసులను త్వరగా విచారించాలని ప్రభుత్వం సుప్రీం కోర్టును కోరింది. ఈ నెలలోనే దీనిపై స్పష్టత వస్తే వెంటనే కార్యాచరణను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేయనుంది.

కేంద్రం భద్రతాపర అభ్యంతరాలు

విశాఖలో రాజధాని ఏర్పాటు అంశంపై కేంద్రం కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈస్టర్న్‌నేవల్ కమాండ్ ఇక్కడే ఉండటం, భద్రతాపరంగానూ కీలకమైన ప్రాంతం, పెట్రోలియం నిల్వలు, రక్షణ విభాగ నిల్వలకు విశాఖ తీరం కేంద్రం కావడంతో అక్కడ రాజధాని ఏర్పాటు చేస్తే వచ్చే సమస్యలపై కేంద్రం అభ్యంతరం పెట్టినట్లు తెలిసింది. దీనిపైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో చర్చలు జరుపుతోంది. త్వరలోనే ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.



మంత్రి రోజాకు పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్, తదితరులు

మంత్రి రోజాకు విశిష్ట మహిళా పురస్కారం

- ప్రదానం చేసిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)

గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం విశిష్ట మహిళా పురస్కారాన్ని మంత్రి రోజాకు మంగళవారం ప్రదానం చేసింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ పురస్కారాన్ని అందజేసింది. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ.. అన్నిటికంటే మానవత్వం గొప్పదన్నారు. గౌరవానికి, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తూ ఎందరో మహిళలు చరిత్రలో స్థానాన్ని సాధించారని, నేటి మహిళలూ అదే స్ఫూర్తితో ముందుకెళ్లాలని అన్నారు. మహిళలు ఎదగడానికి పురుషులు సహకరించాలని కోరారు. మూడు దశాబ్దాల తన సినీ, రాజకీయ జీవితంలో మహిళగా ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నానని, తన ఎదుగుదలకు తండ్రి, సోదరులు, భర్త, కుమారుడు ఎంతో ప్రోత్సహించారని తెలిపారు. ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. కష్టపడితే ఎవరైనా విజయం సాధిస్తారని, మహిళలు ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమానికి వర్సిటీ మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ శాంతిశ్రీ అధ్యక్షత వహించగా వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్, రెక్టార్ ప్రొఫెసర్ వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ కరుణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అదానీపై జెపిసి విచారణ చేపట్టాలి : నారాయణ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అదానీ కంపెనీ వ్యవహారాలపై జాయింట్ పార్లమెంట్ కమిటీ (జెపిసి) విచారణ చేపట్టాలని, వివరాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందుంచాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు. తిరుపతిలోని సిపిఐ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ అదానీకి అనుకూలంగా రిపోర్టు ఇస్తుందని, అయితే బహిరంగంగా విచారణ జరిపితే ప్రజలకు రోజువారి సమాచారం ఉంటుందని తెలిపారు. కమిటీని ప్రకటించగానే అదానీ కంపెనీ స్వాగతం పలకడంలోనే అర్థం చేసుకోవచ్చని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మాల్సిన అవసరం ఏముందని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్టీల్ ప్లాంట్‌ను కొనగానే స్క్రాప్ కింద అమ్మి వేసి 30 వేల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకొని డంపింగ్ యార్డ్‌గా మార్చేస్తారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యాస్ ధర రూ.400 చేసిందని కొబ్బరికాయ కొట్టిన మోడీ నేడు రూ.1200 చేసిన దానికి కొబ్బరికాయ ఎక్కడ కొట్టాలని ఎద్దేవా చేశారు. ఏప్రిల్ 14 నుండి మే ఒకటో తేదీ వరకు 'మోడీ హటావో దేశ్ బచావో' అనే నినాదంతో దేశవ్యాప్తంగా పాదయాత్రలు చేపడతామన్నారు. విశాఖ సమ్మిట్ ఒక నాటకమని, మూడేళ్ల క్రితం పరిశ్రమలను ఎందుకు ఆహ్వానించలేదని ప్రశ్నించారు. అమర్‌రాజా లాంటి పరిశ్రమలను తరిమేసిన జగన్ కొత్త పరిశ్రమలను ఎలా తీసుకొస్తారని ప్రశ్నించారు. లోకేష్, చంద్రబాబు పర్యటనలు అడ్డుకోవడం సరికాదన్నారు.

నిధులివ్వండి

- ఆర్థికశాఖకు పలు శాఖల డిమాండ్
- ఎస్‌ఎన్‌ఎ ఖాతాలకు మాత్రమే గ్రీన్‌సిగ్నల్!

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఇంకా కొద్ది రోజులు మాత్రమే గడువు ఉండడంతో పలు శాఖల నుంచి నిధుల కోసం డిమాండ్ పెరుగుతోంది. త్వరగా నిధులు విడుదల చేస్తే చేయాల్సిన కార్యక్రమాలు చాలా ఉన్నాయంటూ ఆర్థికశాఖకు విజ్ఞప్తులు వెల్లువలా వస్తున్నాయి. ఇందులో సాధారణ నిధులతోపాటు కేంద్ర పథకాలతో అనుసంధానంగా ఉన్న నిధులపైనా డిమాండ్లు కూడా ఎక్కువగానే కనిపిస్తున్నాయి. ఆర్థికశాఖ మాత్రం కేంద్ర పథకాలకు రాష్ట్రం తరపున వాటాగా ఇవ్వాల్సిన నిధులవైపే మొగ్గు చూపిస్తున్నట్లు సమాచారం. మరో 23 రోజుల్లో 2022-23 ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఇప్పటికీ పలు కీలక శాఖలకు నిధుల విడుదల కావడం లేదు. ప్రధానంగా పెట్టుబడి వ్యయానికి సంబంధించిన నిధులు కూడా రాకపోవడంతో ఆయా శాఖలు ఇబ్బందులు పడుతున్నాయి. 11 నెలలుగా నిధుల కోసం ప్రతిపాదనలు పెడుతున్నప్పటికీ నామమాత్రంగానే విడుదలవుతున్నట్లు అధికారులు అంటున్నారు. అందుకే చివరి రోజుల్లోనైనా ఈ నిధుల్లో ఎంతో కొంత సాధించుకునేందుకు ఆయా శాఖలు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం జరిగిన కార్యదర్శుల స్థాయి సమీక్షలోనూ అధికారులు ఈ నిధులపైనే నిశితంగా ప్రస్తావించినట్లు తెలిసింది. ప్రధానంగా విద్య, వైద్యం, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, మహిళాభివృద్ధి, గిరిజన సంక్షేమం, యువజన సంక్షేమం వంటి శాఖల అధికారులు ఆర్థికశాఖపై ఒత్తిడి పెంచుతున్నట్లు తెలిసింది.

కోవిడ్ నిధులూ పెండింగే..

వైద్యశాఖకు సంబంధించి కోవిడ్ కోసం ఖర్చు చేసిన నిధులూ ఇంకా విడుదల కాలేదని అధికారులు అంటున్నారు. 2020 నుంచి ఖర్చులో కొంతమొత్తం ఇంకా పెండింగ్‌లోనే ఉండడంతో అధికారులు పలు దఫాలుగా ఆర్థికశాఖకు లేఖలు రాశారు. ఇదే సమయంలో తమ శాఖలకు సంబంధించి కేంద్ర పథకాలతో అనుసంధానంగా ఉన్న నిధులను సింగిల్ నోడల్ ఏజెన్సీకి జమ చేయాల్సి ఉన్నప్పటికీ అవి విడుదల కాలేదని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ఆయుష్ నిధులు పెండింగ్‌లో ఉండడంతో వాటి కోసం ఆర్థికశాఖకు వైద్యాధికారులు లేఖలు రాస్తున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి సంబంధించి రూ.వెయ్యి కోట్లకుపైగా నిధులు ఆర్థికశాఖ వద్దనే పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. ఇందులో సింగిల్ నోడల్ ఏజెన్సీకి జమ చేయాల్సిన రూ.900 కోట్లు కూడా ఉన్నాయి. స్త్రీ శిశు సంక్షేమ శాఖకు సంబంధించి ఆర్టికల్ 271 నిధులు 2019 నుంచి పెండింగ్‌లోనే ఉన్నట్లు చెబుతున్నారు. క్రీడలు, యువజన సంక్షేమశాఖలో ప్రోత్సాహకాలు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయని, ఉన్నత విద్యాశాఖలో రుసా అర్హత నిధులు, ఇతర శాఖల నుంచి కూడా భారీగా నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే ప్రస్తుత ఆర్థిక సమస్యల కారణంగా ఎస్‌ఎన్‌ఎతో అనుసంధానం కలిగిన నిధుల విడుదలపైనే ముందుగా దృష్టి సారించాలని ఆర్థికశాఖ దాదాపుగా నిర్ణయించింది. దీంతో ఇతర నిధులు మార్చి 31లోగా వచ్చే అవకాశాలు లేవని స్పష్టమవుతోంది.

స్వాతిపై దాడి నిందితులకు రిమాండ్

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడుగా ఉన్న ఉమాశంకర్‌రెడ్డి భార్య స్వాతిపై దాడి చేసిన కొమ్మా పరమేశ్వరరెడ్డి, ఆయన కుమారుడు సునీల్ కుమార్‌రెడ్డిలను మంగళవారం జమ్మలమడుగు కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. న్యాయస్థానం వారికి 14 రోజులు రిమాండ్ విధించింది. మూడు రోజుల క్రితం వివేకా హత్య కేసులో నిందితుడుగా ఉన్న ఉమాశంకర్‌రెడ్డి భార్య స్వాతిపై కొమ్మా పరమేశ్వరరెడ్డి దాడి చేశారు. బాధితురాలు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీరిద్దరిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

అప్పుల సిఎంకు కాలం చెల్లింది..!

- టామోటా జాక్‌పాట్ విధానం రద్దు చేస్తాం
- యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి-వాల్మీకిపురం/కలికిరి

రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి కాలం చెల్లిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర మంగళవారం 37వ రోజుకు చేరుకుంది. అన్నమయ్య జిల్లా కలికిరి ఇందిరమ్మనగర్ నుంచి యాత్ర ప్రారంభమైంది. యాత్ర సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఎస్‌టి, మైనార్టీ, రైతులు, విద్యార్థులతో మాటామంతీ నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. చంద్రబాబునాయుడు హయాంలో ఆంధ్ర రాష్ట్రంలో వివిధ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు మొగ్గు చూపేవని, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఉన్న కంపెనీలు కూడా చేతులెత్తేస్తున్నాయన్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం పెండింగ్‌లో ఉన్న బిల్లులకు వడ్డీతో సహా చెల్లిస్తామని హామీనిచ్చారు. పంటలకు గిట్టుబాటు ధర లేక, కళాశాల ఫీజులు చెల్లించుకోలేక ఎంతోమంది తల్లిదండ్రులకు గుండెపోటు వస్తోందని, టిడిపి అధికారంలోకి రాగానే విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నేరుగా కళాశాలలకు జమ చేస్తామని తెలిపారు. పట్టు, హార్టికల్చర్, పాడి పరిశ్రమలపై రైతులు మొగ్గు చూపితే మంచి ఆదాయం వస్తుందని సూచించారు. యూరోప్ వంటి రాష్ట్రాల్లో వ్యవసాయం లాభసాటిగా ఉందంటే ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వల్లేనని, ప్రభుత్వాలు సబ్సిడీ ఇస్తేనే రైతుల పరిస్థితి మెరుగుపడుతుందని తెలిపారు. డీజిల్, పెట్రోలు ధరలు పెరగడం వల్ల నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాల్లో టమోటా రైతులకు గిట్టుబాటు ధర లేదని, వంద బాక్సుల టమోటాలో 20 బాక్సులు జాక్ పాట్ తీస్తున్నారని, టిడిపి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో జాక్ పాట్ విధానం రద్దు చేస్తామని హామీనిచ్చారు. విజయవాడ టిడిపి నేత వంగవీటి రాధ యాత్రలో పాల్గొని, లోకేష్‌కు సంఘీభావం తెలిపారు. యాత్ర వాయల్పాడు మండలంలోని వాండ్లపల్లి, గంధబోయినపల్లి మీదుగా బోయపల్లి వరకు చేరుకుంది. బుధవారం బోయనపల్లి నుంచి యాత్ర ప్రారంభం కానుంది.

ముస్లిముల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తాం

ముస్లిం మైనార్టీల అభివృద్ధికి టిడిపి చిత్తశుద్ధితో పనిచేస్తుందని లోకేష్ అన్నారు. ముస్లిమ యువకులతో ఆయన ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. లోకేష్ మాట్లాడుతూ.. ఉర్దూ చదివిన వారికి తమ ప్రభుత్వం రాగానే డిఎస్‌సి ద్వారా పోస్టులు విడుదల చేస్తామని, ఇస్లామిక్ బ్యాంకును తప్పకుండా ఏర్పాటు చేస్తామని, విదేశాలకు వెళ్లి ఇబ్బందులు పడే వారికోసం గతంలో ఎపిఎన్‌ఆర్‌టిని ఏర్పాటు చేసి దాని ద్వారా సహాయ సహకారాలు అందజేసేవారిమని, ఇప్పుడున్న ప్రభుత్వం ఆ వ్యవస్థను నాశనం చేసి ముస్లిము మైనార్టీలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. మేము తిరిగి అధికారంలోకి రాగానే మళ్లీ ఆ బోర్డును క్రమబద్ధీకరిస్తామని హామీనిచ్చారు. వక్ఫ్ ఆస్తులకు జ్యుడీషియల్ పవర్ తప్పనిసరిగా తీసుకువస్తామని అన్నారు.



ముస్లిములతో నిర్వహించిన ముఖాముఖిలో మాట్లాడుతున్న లోకేష్

మెటాలో మళ్లీ వేలాది సిబ్బందికి ఉద్వాసన..!

వాషింగ్టన్ : ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా మరో మారు వేలాది మంది ఉద్యోగులను ఇంటికి పంపించనుంది. వచ్చే వారంలోనే ఈ తొలగింపులు ఉండొచ్చని బ్లూమ్‌బర్గ్ రిపోర్ట్ చేసింది. ఆర్థిక వ్యవస్థల్లో మందగింపు, ఆదాయాలు తగ్గడంతో టెక్ కంపెనీలు పొదుపు చర్యలకు దిగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే గతేడాది నవంబర్‌లోనూ మెటాలో 13 శాతానికి సమానమైన 11,000 మంది ఉద్యోగులను తొలగించింది. తాజాగా మరోసారి వేటు వేయనుందని తెలుస్తోంది. ఎవర్ని తొలగించాలో చెప్పాలంటూ డైరెక్టర్లు, వైస్ ప్రెసిడెంట్లు, ఉన్నతాధికారుల నుంచి సమాచారాన్ని సేకరిస్తుంది. వచ్చే వారంలోనే ఈ ఉద్వాసనలు ఉండొచ్చని రిపోర్టులు వస్తున్నాయి. మేనేజర్లకు ప్యాకేజీ ఇచ్చి పంపించడానికి ఇప్పటికే ప్రక్రియను ప్రారంభించింది.

ఉద్యోగులకు పింక్ స్లిప్‌లు జారీ చేసేందుకు సిద్ధమయ్యిందని సమాచారం. మెటా చీఫ్ జూకర్‌బర్గ్ ఆర్థిక లక్ష్యాలను చేరుకోవడానికి తొలగింపులు తప్పడం లేదని ఓ ఉద్యోగి పేర్కొన్నారు. వ్యయాలను తగ్గించుకోవడానికి వేలాది మంది ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్న మెటా తమ సిఇఒకు మాత్రం ఇటీవల భారీ మొత్తంలో చెల్లింపులు పెంచాలని నిర్ణయించింది. మెటా సిఇఒ మార్క్ జూకర్‌బర్గ్ సెక్యూరిటీ అలవెన్స్‌ను ఏకంగా 14 మిలియన్ డాలర్లకు (దాదాపు రూ.115 కోట్లు) పెంచింది. ఇంతక్రితం ఈ అలవెన్స్ 4 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.33 కోట్లు)గా ఉంది. ఓ వైపున ఉద్యోగులను తొలగిస్తూ.. మరోవైపు కంపెనీ బాస్ ఇంత ప్యాకేజీని పెంచుకోవడం గమనార్హం. 2021లో జూకర్ బర్గ్ అన్ని రకాల వరిహారాలను కలుపుకొని 27 మిలియన్ డాలర్ల (రూ.223 కోట్లు) వేతనాన్ని అందుకున్నారు.

కర్నూల్‌లో పవర్ గ్రిడ్ పెట్టుబడులు

- రూ.4,071 కోట్లకు ఆమోదం

న్యూఢిల్లీ : దేశంలో రెండు ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వ రంగంలోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ రూ.4,071 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపింది. దీనికి సోమవారం పవర్ గ్రిడ్ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ ఆమోదం తెలిపారని ఆ కంపెనీ బిఎస్‌ఇ ఫైలింగ్‌లో తెలిపారు. కర్నూల్ విండ్ ఎనర్జీ జోన్ / సోలార్ ఎనర్జీ జోన్ (ఎపి) పార్ట్ ఎ, పార్ట్ బి కోసం రూ.3,546.94 కోట్లు వ్యయం చేయనున్నట్లు తెలిపింది. 2024 నవంబర్ ఈ ప్రాజెక్టులు పూర్తి కానున్నాయని వెల్లడించింది. అదే విధంగా ఈస్టర్న్ రీజి యన్ విస్తరణ స్కీమ్‌కు రూ.524.04 కోట్ల వ్యయం చేయనున్నాట్లు తెలిపింది. ఈ ప్రాజెక్టు నవంబర్ 2025 నాటికి అందుబాటులోకి రానుందని పేర్కొంది.

టిఐజిసి ప్రచారకర్తగా సూర్య కుమార్ యాదవ్

బెంగళూరు : ఫ్యాషన్ మెన్స్‌వేర్ బ్రాండ్ టిఐజిసి తన బ్రాండ్ అంబాసీడర్‌గా క్రికెటర్ సూర్య కుమార్ యాదవ్‌ను నియమించుకున్నట్లు ప్రకటించింది. సూర్య కుమార్ ప్రజాదరణ తమ పూర్తి సరికొత్త శ్రేణీ క్యాజువల్ అప్పెరల్ శ్రేణికి ప్రచారం చేయనున్నారని పేర్కొంది. దేశంలో డిజిటల్ ఫస్ట్ ఫ్యాషన్ మార్కెట్‌ను చేజిక్కుంచుకునేందుకు ఇది మా తొలి అడుగు అని టిఐజిసి ఫౌండర్, సిఇఒ అనంత్ టాంటెడ్ తెలిపారు. సూర్య కుమార్‌తో బలమైన బంధం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నామన్నారు.

'మిరాకిల్' వద్ద ఉద్రిక్తత

- భూ ఆక్రమణ ఆరోపణలపై స్వాధీనానికి అధికారుల యత్నం

ప్రజాశక్తి -భోగాపురం (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా భోగాపురం మండలం ముంజేరు గ్రామ సమీపంలోని మిరాకిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీ వద్ద మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. మిరాకిల్ సంస్థ యాజమాన్యం వాగులు, వంకలు, రస్తాలు కలిపి 14.22 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించిందన్న ఆరోపణల నేపథ్యంలో స్వాధీనానికి అధికార యంత్రాంగం సమాయత్తమైంది. తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు ఆధ్వర్యాన పోలీసులు, రెవెన్యూ అధికారులు జెసిబిలతో కంపెనీ వద్దకు చేరుకున్నారు. దీంతో మిరాకిల్ సంస్థ ఉద్యోగులు, ముంజేరు గ్రామస్తులు.. కంపెనీ గేటు వద్ద అధికారులను అడ్డుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు, కంపెనీ ఉద్యోగుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. భోగాపురం సిఐ విజయనాథ్, ఆర్‌డిఒ సూర్యకళ కంపెనీ యాజమాన్యంతో చర్చించారు. అనంతరం అక్రమంగా వేసిన రహదారులను జెసిబిలతో తొలగించారు. మిగిలిన ఆక్రమణలను కూడా తొలగించే చర్యలు చేపట్టారు. మిరాకిల్ సంస్థ ఎండి లోకం ప్రసాద్ మాట్లాడుతూ ఇది కక్ష పూరిత చర్య అని విమర్శించారు. రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు ఇలాంటి చర్యలకు దిగడం సరికాదన్నారు. తమ సంస్థ పరిరక్షణలోని ప్రభుత్వ భూముల విషయంపై 2016లో హైకోర్టు స్టే విధించిందని చెప్పారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, ఆర్‌డిఒ, తహశీల్దార్‌కు ఆధారాలతో రాతపూర్వకంగా తెలియజేశామని వెల్లడించారు. హైకోర్టు ఇచ్చిన స్టే ఉన్నప్పటికీ అధికారులు లోపలికి ప్రవేశించడం అన్యాయమన్నారు.



అధికారులను అడ్డగించిన స్థానికులు, సంస్థ ఉద్యోగులు

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వృథా ఖర్చే

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వృథా ఖర్చేనని, రైతులకిచ్చే ఉచిత విద్యుత్‌కు మంగళం పాడేందుకు పాలకుల ఎత్తుగడలో భాగమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో రూ.6,500 కోట్ల వ్యయంతో 18.50 లక్షలకు పైగా వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు అమర్చే పనిలో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా శ్రీకాకుళం జిల్లాలో 28 వేల పంపుసెట్లకు రాష్ట్ర ప్రభుత్వం మీటర్లు అమర్చిందని తెలిపారు. దీనివల్ల ఎలాంటి ఉపయోగమూ లేదని, కేవలం ప్రజలపై ఆర్థిక భారమేనని పూణేకు చెందిన ప్రయాస్ ఎనర్జీ గ్రూప్ అనే స్వచ్ఛంద సంస్థ చేసిన అధ్యయన నివేదిక పేర్కొందని తెలిపారు. ప్రయాస్ సంస్థ ఇచ్చిన నివేదికను రహస్యంగా దాచేసిన జగన్ సర్కార్ శ్రీకాకుళంలో ఈ ప్రాజెక్టు వల్ల 36 శాతం విద్యుత్ ఆదా అయినట్లు అవాస్తవాలు చెబుతోందని వివరించారు. రైతులకిచ్చే ఉచిత విద్యుత్ కోసం స్మార్ట్ మీటర్లు, అనుబంధ పరికరాల కొనుగోలు, నెలవారీ మీటర్ రీడింగ్, నిర్వహణ వంటి వృథా ఖర్చు ఎందుకో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎంఫ్‌ల్లో 10 శాతమే మహిళా ఫండ్ మేనేజర్లు

న్యూఢిల్లీ : మ్యూచువల్ ఫండ్ పరిశ్రమలో 42 మంది మహిళ ఫండ్ మేనేజర్లు మాత్రమే ఉన్నారని మార్నింగ్ స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ ఇండియా తెలిపింది.

గతేడాది 32 మంది ప్రాథమిక, ద్వితీయ శ్రేణీ ఫండ్ మేనేజర్లు ఉన్నారని పేర్కొంది. ఈ పరిశ్రమలో మొత్తం ఫండ్ మేనేజర్ల సంఖ్య 399 నుంచి 428కి పెరిగిందని ఇండియన్ మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ -2023లో మార్నింగ్ స్టార్ తెలిపింది. 24 ఫండ్ కంపెనీల్లో 42 మంది మాత్రమే ఉన్నారని తెలిపింది. ఐదు సంస్థల్లో ముగ్గురు ఆపైన మహిళలు ఉన్నారు. ఆరింటిలో ఇద్దరు, 13 సంస్థల్లో ఒక్కరు చొప్పున ఫండ్ మేనేజర్లు ఉన్నారు.

సానియా గుడ్‌బై

సరైన ప్రోత్సాహం, దృఢమైన సంకల్పం ఉంటే...మహిళలు సాధించలేనిదేమీ లేదని నిరూపించిన అతి కొద్దిమంది దిగ్గజ క్రీడాకారిణుల్లో ఒకరిగా 36 ఏళ్ల సానియా మీర్జా చరిత్రను పునర్లిఖించింది. తన కెరీర్ ఎక్కడ మొదలుపెట్టిందో... అదే ఎల్‌బి స్టేడియంలో చివరి మ్యాచ్ ఆడేసిన ఈ భారత టెన్నిస్ సూపర్‌స్టార్ ఘనంగా తన కెరీర్‌కు వీడ్కోలు పలికింది. మహిళలు ఎదుర్కొనే ఆటుపోట్లతోపాటు మత కట్టుబాట్లను సైతం దాటి దేశానికి గర్వకారణంగా నిలిచి... ఓ పోరాట యోధురాలిగా తన ప్రస్థానాన్ని సాగించి.... యువ మహిళా క్రీడాకారులతోపాటు ఎందరికో ఆమె స్ఫూర్తిదాయకంగా నిలిచింది. రెండు దశాబ్దాల ఆమె క్రీడా జీవితాన్ని పరిశీలిస్తే... మూడు డబుల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు, మరో మూడు మిక్స్‌డ్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు, 43 డబుల్స్ ట్రోఫీలు, 91 వారాలపాటు డబుల్స్‌లో నంబర్‌వన్‌గా నిలవడం లాంటి ఎన్నో ఘనతలు సాధించింది. అంతేకాదు...తన ఆటతోపాటు మాటతోనూ... చేతలతోనూ తాను ఎంత ప్రత్యేకమో నిరూపించుకుని... క్రీడల్లో అడుగుపెట్టాలనుకునే అమ్మాయిలందరికీ ఓ స్ఫూర్తిప్రదాతగా.. సూపర్ స్టార్‌గా... నిలిచింది.

అమ్మాయిలు ఆటల్లో ప్రవేశించాలి... రాణించాలి... అన్న ఓ తండ్రి పట్టుదల సానియా మీర్జా విజయంలో కీలకపాత్ర. టెన్నిస్‌లాంటి ఖరీదైన, వ్యక్తిగత క్రీడలోకి తండ్రి ఇమ్రాన్‌మీర్జా ప్రోత్సాహంతో ఆరో ఏటే అడుగుపెట్టింది సానియా...11 ఏళ్ల వయసులో హైదరాబాద్‌లోని ఓ కోర్టులో సాధన చేయిస్తుండగా... 'ఇలాంటి పొట్టి దుస్తులతో టెన్నిస్ అవసరమా?' అంటున్న మాటలు ఈటెల్లా తగులుతూనే ఉన్నాయి ఆ తండ్రికి. మరో మిత్రుడు వచ్చి 'ఏంటి సానియాను మార్టినా హింగిస్ చేద్దామనుకుంటున్నావా' అంటూ ఓ కామెంట్ చేసి వెళ్లిపోయాడు. తర్వాతి రోజుల్లో మార్టినా హింగిస్‌తోనే నంబర్‌వన్ జోడీగా నిలవడంతోపాటు 14 డబుల్స్ టైటిల్స్ సాధించి తానెంత ప్రత్యేకమో సానియా నిరూపించుకుంది. ఎన్ని వ్యాఖ్యలెదురైనా చిన్నారి సానియాను తన శిక్షణలోనే రాటుదేల్చాడు ఇమ్రాన్ మీర్జా. టోర్నీలు గెలిచాకా... ప్రోత్సాహకాలు అందజేయడం, ముందుగానే ఔత్సాహిక క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించి తగు విధంగా ప్రోత్సాహాన్నిస్తే మట్టి నుంచి మాణిక్యాలు తీయొచ్చు. ఆ దూరదృష్టి ప్రభుత్వాలకు కొరవడింది. మొదట్లో సానియా కుటుంబానికి దేశవ్యాప్తంగా టోర్నీలకు విమానాల్లో వెళ్లే స్తోమత లేక పాతకారులోనే వందల కొద్దీ కిలోమీటర్లు ప్రయాణం చేసింది. 13 ఏళ్ల వయసులో జాతీయ అండర్ -14, అండర్-16 టైటిల్స్ గెలిచి తొలిసారి అందరి దృష్టినీ ఆకర్షించింది. ఎల్‌బి స్టేడియంలో తొలిసారి సీనియర్ స్థాయి టోర్నీ హైదరాబాద్ ఓపెన్‌లో సింగిల్స్ విభాగం నుంచి పోటీపడి తొలిరౌండ్లోనే పరాజయం పాలైనా... రెండేళ్ల తరువాత అదే టోర్నమెంట్ విజేతగా తన ముద్రను బలంగా చాటింది. ఈ క్రమంలోనే గ్రాండ్‌స్లామ్స్‌లో పోటీపడుతూ 2007 ఆగస్టులో సింగిల్స్‌లో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 27వ స్థానానికి చేరుకుని, ఆ ఘనత సాధించిన తొలి భారతీయ మహిళగా నిలిచింది. ఆ తరువాత సింగిల్స్ నుంచి డబుల్స్ విభాగానికి మారి, టెన్నిస్ ప్లేయర్లు కలలుగనే గ్రాండ్‌స్లామ్ ట్రోఫీని డబుల్స్ విభాగంలో మూడుసార్లు, మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో మరో మూడుసార్లు సాధించి తన సత్తా చాటింది.

టెన్నిస్ ప్రపంచంలో అసమాన విజయాలను అందుకున్న ఈ సూపర్ స్టార్...ఎన్నో వివాదాలనూ, విమర్శలనూ ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొంది. స్కర్ట్ వేసుకుని ఆడటంపై మతపెద్దల ఫత్వా, మసీదులో షూటింగ్‌లో పాల్గొనడం, పాకిస్తాన్ క్రికెటర్ షోయబ్ మాలిక్‌తో వివాహం... వంటి వాటిని కొందరు వివాదాస్పదం చేసేందుకు ప్రయత్నించినా, ధైర్యంగా ఎదుర్కొంది. 2012 లండన్ ఒలింపిక్స్ సందర్భంలో మిక్స్‌డ్ డబుల్స్‌లో తనతో సానియాను ఆడిస్తేనే విష్ణుతో కలిసి డబుల్స్ ఆడతానని పేస్ చెప్పడంపై ఘాటుగా స్పందించింది. పురుషాధిక్యతకు నిదర్శనంగా పేర్కొంటూ, ఒక ఆటగాడి కోసం తనను ఎరగా వేశారని జాతీయ టెన్నిస్ సమాఖ్యపై మండిపడింది. ఇలా... తనదైన శైలిలో టెన్నిస్ క్రీడాయవనికపై ముద్రవేసిన సానియా కెరీర్‌కు స్వస్తి పలికినా... ఎందరో సానియాలను తీర్చిదిద్దుతానని చేసిన ప్రకటన భారత టెన్నిస్‌కు సరికొత్త తారలను తీసుకురావాలని ఆశిద్దాం. సరైన సామర్థ్యం ఉండి, ఆటాడే వసతులు లేక, ప్రోత్సాహం, డబ్బు లేక మరుగునపడిన ఆణిముత్యాలను వెలికితీసేందుకు ప్రభుత్వాలు నడుంబిగిస్తే... సరైన ప్రోత్సాహాన్నిస్తే... ఎందరో సానియాలను సృష్టించొచ్చు.

మహనీయుల మాట



శ్రామిక మహిళ విముక్తి పోరాటం అనేది...బూర్జువా మహిళలు తమ పురుషులకు వ్యతిరేకంగా చేసే పోరాటం లాంటిది కాదు. దానికి మారుగా ఆమె తన వర్గానికి చెందిన పురుషులతో కలిసి...మొత్తం పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటం చేయాలి.

- క్లారా జెట్కిన్

అన్నింటా సమానత్వం కోసం ముందడుగు వేద్దాం...

సందర్భం



కె.స్వరూపరాణి

మార్చి-8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం. అమానవీయ పని పరిస్థితులకు వ్యతిరేకంగా...ఉపాధి భద్రత, 8 గంటల పని, కనీస వేతనం, ఓటు హక్కు కోసం పోరు సల్పిన మహిళా స్ఫూర్తిని మననం చేసుకోవాల్సిన రోజు. సమానత్వం, గౌరవం, భద్రత కోసం ఐక్యంగా పోరాడదామంటూ ప్రతిన పూనాల్సిన రోజు.

18, 19 శతాబ్దాల్లో జరిగిన పారిశ్రామిక విప్లవం ఇళ్ళ నుండి మహిళలను బయటకు తీసుకొచ్చింది. కుటుంబ ఆర్థిక అవసరాలు సామాజిక ఉత్పత్తిలో పాల్గొనేట్లుగా చేశాయి. ఇంటి చాకిరి ఒక వైపు, మరోవైపు కర్మాగారాల్లో, అంతు లేని శ్రమ దోపిడీలో 14 గంటల నుండి 16 గంటలు పని చేయాల్సిన దుస్థితి ఉండేది. అసమాన వేతనాలతో తిండి లేక చిన్నతనంలోనే వృద్ధాప్య చాయలు పొడ చూపేవి. నాటి శ్రామిక మహిళల ఆయు:ప్రమాణం 36 సంవత్సరాలకు దిగజారింది.

అమెరికా దేశంలో కర్మాగారాల్లో పనిచేస్తున్న శ్రామిక మహిళలు ఒకరికొకరు కూడబలుక్కొని సంఘటితం అయ్యారు. ఒకరి కష్టాలు ఒకరు అర్థం చేసుకున్నారు. ఈ ఐక్యతే పోరాటాలకు నాంది. పలికింది. 1845లో 16 గంటల నుండి 10 గంటలకు పని తగ్గించాలని కోరుతూ సమ్మె నెల రోజులపాటు సాగింది. భారీ ర్యాలీలు జరిగాయి. ఈ ఉద్యమాన్ని యాజమాన్యం అణిచి వేయాలని ప్రయత్నించింది. 1857 న్యూయార్క్ నగరంలో "ఆకలితో చస్తూ బతికే కన్నా పోరాటంలో చావడం మేలని భావించి బట్టల మిల్లుల్లో పనిచేసే మహిళా కార్మికులు సమ్మె చేసి విజయాన్ని సాధించారు. అనేక దేశాలలో హక్కుల కోసం భారీ ర్యాలీలు జరిగాయి.

1863 జూన్ చివరి వారంలో లండన్ దినపత్రికల్లో "అధిక శ్రమతో మహిళ మృతి" అనే వార్త వచ్చింది. దొరసానుల బట్టలు కుట్టే 20 ఏళ్ళ మేరీ అన్నే వాక్లే గురించిన వార్త అది. మాంచెస్టర్ నుండి మద్రాసు వరకు ఫ్యాక్టరీల్లోని కార్మికులు ఎలాంటి కాలపరిమితి లేకుండా 18వ శతాబ్దంలో తమకు తామే యంత్రాలుగా మారిపోయారు. నడుం విరిచే, గుండెలు పగిలే పనిని భరించలేక యువ కార్మికులు ఎందరో మరణించారు. మేరీ అనారోగ్యానికి గురైనప్పుడు యజమాని పట్టించుకోలేదు. కిక్కిరిసిన గదిలో సుదీర్ఘ గంటలు పనిచేయడం వలన...గాలి, వెలుతురు లేని గదిలో నిద్రించడం వలన...అనారోగ్యానికి గురై మరణించిందని... ఆఖరి క్షణాల్లో ఆమెకు వైద్యం అందించేందుకు పిలవబడిన డాక్టర్ కోర్టుకు తెలిపారు.

ఆ తర్వాత అంతర్జాతీయ స్థాయిలో కార్మికులను ఏకం చేసే యత్నాలు మొదలయ్యాయి. 1864లో గ్రేట్ బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, పోలెండ్, ఇటలీలకు చెందిన కార్మిక ప్రతినిధులు లండన్‌లో సమావేశమయ్యారు. పెద్ద ఎత్తున కార్మిక సంఘాలు, సోషలిస్టు నాయకులు, సమావేశానికి వచ్చారు. వారిలో కారల్ మార్క్స్ కూడా ఉన్నారు. ఈ సమావేశంలో ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ ఆవిర్భవించింది. 1886 మే 1న ఎనిమిది గంటల పని దినం కోసం పెద్ద ఎత్తున అమెరికా లోని చికాగోలో ర్యాలీలు నిర్వహించారు. 1889లో జరిగిన రెండవ ఇంటర్నేషనల్ సదస్సుతో క్లారా జెట్కిన్ అధిక పని గంటలు, అతి తక్కువ వేతనాలు, అమానవీయ పని ప్రదేశాలు మొదలైన అంశాలపై శ్రామిక పురుషులతో పాటు మహిళలు కూడా విముక్తి పొందాలని పిలుపునిచ్చారు.



నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

"అంతర్జాతీయంగా" మహిళా దినోత్సవం జరపాలని 1910, ఆగస్టు 26, 27 తేదీలలో డెన్మార్క్ రాజధాని కోపెన్‌హెగెన్ లో మహిళా సదస్సు జరిగింది. 17 దేశాల నుండి దాదాపు వంద మంది ప్రతినిధులు హాజరయ్యారు. చర్చల అనంతరం ఓటు హక్కు, మెటర్నటీ అలవెన్స్, మాతా శిశుసంరక్షణ, 8 గంటల పని మొదలైన తీర్మానాలు ఆమోదించారు. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరపాలని సదస్సు పిలుపునిచ్చింది. చరిత్రలో మైలురాయిగా నిలిచిన అక్టోబర్ విప్లవానికి భూమిక మార్చి 8 కావటం విశేషం.

ప్రపంచ దేశాల్లో స్త్రీల హక్కులకై జరుగుతున్న పోరాటాలు ... మహిళలను అణిచివేత, దోపిడీల నుండి విముక్తులను చేయాలంటే వారిని నాలుగు గోడలకు పరిమితం చేయడం వలన సాధ్యం కాదు. తమలా పని చేసే వారితో కలిసే అవకాశం కల్పించడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. సంఘటితమయ్యే అవకాశం ఉంటుంది. అప్పుడే పని ప్రాంతాలలో తమ తోటి మహిళలతో కలిసి సమస్యలను చర్చించుకొని పోరాడేందుకు సిద్ధపడతారు. సామాజిక సంబంధాల్లో మార్పులు కూడా పోరాటాల ద్వారానే వస్తాయి. సామాజిక ఉత్పత్తిలో భాగస్వాములు అవడం వలననే మహిళలు సైతం పురుషులు లాగా ఉత్పత్తి సంబంధాల్లో భాగస్వామలౌతారు.

ప్రపంచ దేశాల్లో స్త్రీల హక్కులకై జరుగుతున్న పోరాటాలు ... మహిళలను అణిచివేత, దోపిడీల నుండి విముక్తులను చేయాలంటే వారిని నాలుగు గోడలకు పరిమితం చేయడం వలన సాధ్యం కాదు. తమలా పని చేసే వారితో కలిసే అవకాశం కల్పించడం ద్వారా మాత్రమే సాధ్యమ వుతుంది. సంఘటిత మయ్యే అవకాశం ఉంటుంది. అప్పుడే పని ప్రాంతాలలో తమ తోటి మహిళలతో కలిసి సమస్యలను చర్చించుకొని పోరాడేందుకు సిద్ధపడతారు. సామాజిక సంబంధాల్లో మార్పులు కూడా పోరాటాల ద్వారానే వస్తాయి. సామాజిక ఉత్పత్తిలో భాగస్వాములు అవడం వలననే మహిళలు సైతం పురుషులు లాగా ఉత్పత్తి సంబంధాల్లో భాగస్వామలౌతారు. ఈ ఉత్పత్తి సంబంధాలే వర్గ సమాజానికి కీలకమైన అంశం. రెండవ అంతర్జాతీయ కార్మిక సదస్సులో క్లారా జెట్కిన్ 8 గంటల పని, వేతనాలు, వారంలో ఒక రోజు సెలవు, ఓటు హక్కు మొదలైన అంశాలపై శ్రామిక పురుషులతో పాటు మహిళలు విముక్తి పొందాలని పిలుపునిచ్చారు. 1975 నుండి ఐక్యరాజ్యసమితి అధికారికంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరపాల్సిందిగా పిలుపునిచ్చింది.

ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పోరాటాలు భారతదేశ మహిళలపై ప్రభావాన్ని చూపాయి. 19వ శతాబ్దంలో రాజా రామ్మోహన్ రాయ్, విరేశలింగం, గురజాడ, జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి వంటి వారు నడిపిన సంస్కరణోద్యమాలు మహిళా సంఘాలను, వామపక్ష వాదులను ఆకర్షించాయి. జాతీయోద్యమంతో పాటు సతీసహగమనం, బాల్యవివాహాలు, పరదా పద్ధతి రద్దు, స్త్రీ విద్య, ఉపాధి, ఓటు హక్కు, వితంతు పునర్వివాహాల కోసం మహిళలు నాయకత్వం వహించారు. ఆనాటి పోరాటాల ఫలితంగా కొన్ని హక్కులు సాధించుకున్నారు.

75 సంవత్సరాల స్వాతంత్ర్యానంతరం నిరక్షరాస్యత, నిరుద్యోగం, సామాజిక వివక్ష, అత్యాచారాలు, దిగజారుతున్న విలువలు మహిళల పురోభివృద్ధికి ఆటంకంగా ఉన్నాయి. బిజెపి ప్రభుత్వం వచ్చిన తరువాత మహిళల పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్టయ్యింది. మహిళలు కేవలం కుటుంబం, పిల్లలు సంరక్షణకు మాత్రమే పరిమితమై ఉండాలనే మనువాద సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తూ చివరకు వాటిని పాఠ్యాంశాలుగా మారుస్తున్నారు.

స్వాతంత్ర్యానికి ముందు నుండి పోరాడి సాధించుకున్న కార్మికుల చట్టాలను కార్పొరేట్లకు అనుకూలంగా 4 లేబర్ కోడ్‌లను మోడీ ప్రభుత్వం మార్చింది. 1948లో వచ్చిన ఫ్యాక్టరీ చట్టం ప్రకారం స్త్రీలు రాత్రి షిఫ్ట్‌లో పని చెయ్యడాన్ని నిషేధించారు. మోడీ ప్రభుత్వం ఆ నిషేధాన్ని ఎత్తివేసింది. కాని భద్రతా సౌకర్యాల ఏర్పాట్ల గురించి పట్టించుకోలేదు. లాభాలతో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ల పరం చేసింది. చదువు, ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ప్రైవేటు సంస్థలు అమలు చెయ్యవు. 8 గంటల పని హుళక్కే. ఐ.టి రంగంతో సహా మాల్స్ వరకు 10 నుండి 12 గంటలు శ్రమ చేస్తున్నారు. అదనపు పనికి అదనపు వేతనం లేదు.

వేతనంతో కూడిన మెటర్నటీ సౌకర్యం సంస్థలో అరకొరగా అమలు జరుగుతోంది. మహిళలు పట్టణాల్లో 48 శాతం స్వయం ఉపాధిలో వున్నారు. ప్రభుత్వ స్కీముల్లో (అంగన్‌వాడీ, మిడ్ డే మీల్, ఆశ, ఎస్‌ఎస్‌ఎ, ఐకెపి), మెడికల్ హెల్త్ రంగాల్లో కేంద్ర, రాష్ట్ర పథకాల్లో కోటి మంది మహిళలు పని చేస్తున్నారు. వీరికి కార్మిక ఉద్యోగులుగా గుర్తింపులేదు. ఉపాధి భద్రత, సామాజిక భద్రత సౌకర్యాలు లేవు. వ్యవసాయ రంగంలో వ్యాపార పంటలు, యాంత్రీకరణ పెరిగాక ఎక్కువగా పనిదినాలు కోల్పోయింది. మహిళా కార్మికుల్లో 70 శాతం పైగా దినసరి కూలీలుగా, తక్కువ వేతనాలు వచ్చే ఉద్యోగాల్లో ఉన్నారు. కరోనా మహమ్మారి తర్వాత మహిళల పరిస్థితి మరింత దెబ్బతిన్నది. దాదాపు 5, 6 కోట్ల మంది తీవ్రమైన పేదరికం లోకి నెట్టబడ్డరాని అంచనా.

గ్లోబల్ జండర్ గ్యాప్-2022 సూచికలో భారత్ ర్యాంక్ 146 దేశాలకుగాను 135వ ర్యాంకుకు చేరుకుంది. వివక్ష, అసమానతల వలన 15-24 ఏళ్ల మధ్య వయసు మహిళలు కూడా కార్మిక రంగానికి దూరమవుతున్నారు. మహిళల ఆదాయం, ఉత్పాదకత పెంచటంలో కీలకంగా ఉన్న ఉపాధి హామీ పథకానికి...మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత బడ్జెట్ ప్రతి ఏటా తగ్గిస్తున్నారు. నేషనల్ శాంపిల్ (ఎన్‌ఎస్-ఎస్‌ఒ) సర్వే ప్రకారం బయట వేతన కార్మికులుగా పని చేసే మహిళలు ఇంటి పనులు, పిల్లలు, వృద్ధుల సంరక్షణ వంటి వేతనం లేని ఇంటి పనికి పురుషుల కంటే మహిళలు రెండింతలు ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు.

మన స్వాతంత్ర్య పోరాట ఆంక్షలతో రూపుదిద్దుకున్న భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారం చేపట్టిన బిజెపి పాలకులు తిరోగమన మనుస్మృతిని ముందుకు తెస్తున్నారు. ఈ ప్రభుత్వం మతతత్వ, కులతత్వ భావజాలంతో మన ప్రజాస్వామ్య, లౌకికతత్వ ఉనికికే సవాలు విసురుతున్నది. మహిళలకు ఇది అత్యంత ప్రమాదకరం. మరోవైపు మహిళలపై పెరుగుతున్న హింస, వివక్ష, లైంగిక వేధింపులు, శ్రమ దోపిడి, అతి తక్కువ వేతనాలు, ధరలు, పన్నుల భారం, మద్యం మొదలైన అంశాలు మహిళలను మరింత పేదరికంలోకి నెడుతున్నాయి.

చట్టసభలలో మహిళా రిజర్వేషన్ బిల్లు మనువాదుల పాలనలో తెరమరుగున పడింది. 'డిజిటల్ సాంకేతిక రంగాలలో-లింగ సమానత్వం సాధించాలని ఐక్యరాజ్యసమితి ఈ ఏడాది పిలుపునిచ్చింది. డిజిటల్ విద్య, సాంకేతిక రంగాల్లోకి మహిళల ప్రవేశంతో పనిలో నైపుణ్యం ఏర్పడుతుంది. అయితే సాంకేతిక విద్య అభ్యసిస్తున్న వారిలో మహిళలు 37 శాతానికి మించి లేరు. కరోనాలో ఆన్‌లైన్ విద్యకు బాలికలు 65 శాతం క్లాసులు వినలేక విద్యకు దూరమయ్యారని రిపోర్టులు ఉన్నాయి.

నిత్యం మహిళలు ఎదుర్కొంటున్న వివక్ష, అసమానతలు, హింస మొదలైన సమస్యల పరిష్కారంతోపాటు... ప్రజాస్వామ్యం, లౌకిక తత్వం కాపాడబడాలి. కుల మతతత్వాలకు వ్యతిరేకంగా అభ్యుదయ శక్తులను కలుపుకొని విస్తృతంగా మార్చి 8 నుండి 15 వరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిం చాలని అఖిల భారత ప్రజాసంఘాలు పిలుపునిచ్చాయి. మార్చి 8 స్ఫూర్తితో అమరుల త్యాగాలను స్మరిస్తూ అన్నింటా లింగ సమానత్వం కోసం ముందడగు వేద్దాం.

/ వ్యాసకర్త : ఐద్వా పూర్వ రాష్ట్ర కార్యదర్శి /

సహజ వనరులు, ఖనిజ నిక్షేపాలు వరమా? శాపమా?

చర్చ

ఫిరోజ్ ఖాన్

బ్యాటరీ తయారీలో కీలకమైన లిథియమ్ నిల్వలను జమ్మూకాశ్మీర్‌లో ఇటీవల కనుగొన్నట్లు కేంద్ర గనుల శాఖ ప్రకటించింది. 59 లక్షల మెట్రిక్ టన్నుల లిథియం ఉన్నట్లు అంచనా వేసింది. ఈ అంచనా నిజమైతే ప్రపంచంలోనే అత్యధిక లిథియమ్ నిల్వలున్న దేశాల్లో భారతదేశం రెండో స్థానంలో ఉంటుంది. అంతేకాకుండా జమ్మూకాశ్మీర్, ఏపీ, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, జార్ఖండ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఒడిశా, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణల్లో 51 చోట్ల ఖనిజ నిల్వలను గుర్తించారు. వాటిలో 5 బంగారు గనులు సైతం ఉన్నాయి. అంతేకాకుండా పొటాష్, మాలిబ్డినం వంటి లోహాలను గుర్తించారు. అయితే ఇలాంటి సహజ, ఖనిజ నిక్షేపాలు ఆయా ప్రాంతాలకు, దేశ ఆర్థిక వ్యవస్థకు, భవిష్యత్తుకు వరమా? శాపమా? అనే చర్చ అవసరమవుతున్నది.

పర్యావరణంపై తీవ్ర ప్రభావం

లిథియమ్ అయినా ఇతర ఖనిజ నిక్షేపాలైనా వాటిని మైనింగ్ చేసి, వెలికి తీయాలంటే ప్రకృతి, పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతుంది. నేల, నీరు, గాలి కలుషితమవుతాయి. ఉదాహరణకు ఒక టన్ను లిథియమ్‌ను ఉత్పత్తి చేయడానికి 2.2 మిలియన్ లీటర్ల నీరు అవసరమవుతుంది. పర్యావరణంపై పడే ప్రభావాన్ని పట్టించుకోకుండా లిథియమ్‌ను వెలికి తీయడానికి ప్రయత్నిస్తే 'జోషి మఠ్' లాంటి సంఘటనలు మరింత పెరిగే ప్రమాదముంటుంది. ఎలక్ట్రిక్ వాహనాల్లో వాడే బ్యాటరీల్లో లిథియమ్‌ను వినియోగిస్తున్నారు. దీంతో కర్బన ఉద్గారాలు ఎంతో మేర తగ్గించవచ్చని వాదించే వారూ ఉన్నారు. అయితే లిథియమ్ మైనింగ్ ద్వారా ఉత్పత్తి అయ్యే కర్బన ఉద్గారాలను కూడా మనం తోసిపుచ్చలేం. లాభనష్టాలను బేరీజు వేసుకొని, అన్నింటిని సమతుల్యం చేసి ముందుకు సాగితేనే ఫలితముంటుంది. పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతుండడంతో లిథియమ్ వెలికితీతపై ఇప్పటికే అర్జెంటీనా, బొలీవియా వంటి దేశాల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి.

దేశ ఆర్థిక వ్యవస్థపై..?

కేంద్ర గనుల శాఖ అంచనా వేసినట్టు జమ్మూకాశ్మీర్‌లో 59 లక్షల టన్నుల లిథియమ్ నిల్వలు ఉండి, పర్యావరణంపై కనీస ప్రభావంతో వాటిని వెలికితీసినా.. అది దేశ ఆర్థిక వ్యవస్థకు, భౌగోళిక పరిస్థితులకు ఏ మేరకు లాభసాటిగా ఉంటుందనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. చమురు నిల్వలను కనుగొన్నప్పుడు గల్ఫ్ దేశాలు జాక్ పాట్ కొట్టినట్టే భారతదేశ పరిస్థితి ఉండబోతున్నదనే వాదనా ఉన్నది.

చరిత్రను పరిశీలిస్తే...

ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే వివిధ దేశాల్లో పెద్ద ఎత్తున సహజ నిక్షేపాలను కనుగొన్నప్పుడు ఆ దేశాలపై పడ్డ ప్రభావాన్ని చూస్తే అనేక ఆసక్తికర విషయాలను మనం గమనించవచ్చు. కొన్ని దేశాలు సానుకూల పరిస్థితులను సృష్టించుకొని అభివృద్ధి దిశలో పయనించగా, సరైన ప్రణాళికలు లేకుండా మరికొన్ని దేశాలు దీర్ఘకాలికంగా అనేక రంగాల్లో వెనకబాటుకు గురయ్యాయి. గతంలో గల్ఫ్ దేశాలతోపాటు నార్వే, ఆస్ట్రేలియా, రువాండా లాంటి దేశాల్లో పెద్ద ఎత్తున చమురు నిల్వలను కనుగొన్నారు. వీటి వల్ల ఆ దేశ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలే మారిపోయాయి. అదే సమయంలో వీటికి భిన్నమైన ఉదాహరణలు సైతం మనకు కనిపిస్తాయి.

సహజ, ఖనిజ నిక్షేపాలే కొన్ని దేశాలకు శాపంగా మారినట్టు చరిత్ర చెబుతున్న వాస్తవం. 'డచ్ డిసీజ్' పేరుతో నెదర్లాండ్స్ ఎదుర్కొన్న పరిస్థితులు ప్రపంచానికి ఇప్పటికీ ఒక ఉదాహరణగా ఉన్నాయి. 1959లో నెదర్లాండ్స్‌లో భారీ ఎత్తున గ్యాస్ నిల్వలను కనుగొనగా అప్పటి నుంచి ఆ దేశం వాటిని పెద్ద ఎత్తున ఎగుమతి చేయడం పారంభించింది. ఇన్‌స్టంట్‌గా అది దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతో లాభం చేకూర్చినా, దీర్ఘకాలిక వృద్ధిలో తీరని నష్టాన్ని మిగిల్చింది. ఓ దశాబ్దం తర్వాత అంటే 1970-77 మధ్యలో పరిశీలిస్తే ఆ దేశ నిరుద్యోగ రేటు 5.1 శాతానికి చేరుకున్నది. అంతకు ముందు అది ఒక శాతానికి మాత్రమే పరిమితమై ఉన్నది. ఎందుకంటే పెట్టుబడులంతా ఒకే రంగంలో కేంద్రీకృతం కావడం, ఇతర రంగాలు, తయారీ పరిశ్రమలను పట్టించుకోకపోవడంతో ఇలాంటి పరిస్థితి ఉత్పన్నమైందని ఆర్థిక విశ్లేషకులు నిర్ధారించారు.



'డచ్ డిసీజ్' ఒక ఉదాహరణ

సహజ, ఖనిజ నిక్షేపాలే కొన్ని దేశాలకు శాపంగా మారినట్టు చరిత్ర చెబుతున్న వాస్తవం. 'డచ్ డిసీజ్' పేరుతో నెదర్లాండ్స్ ఎదుర్కొన్న పరిస్థితులు ప్రపంచానికి ఇప్పటికీ ఒక ఉదాహరణగా ఉన్నాయి. 1959లో నెదర్లాండ్స్‌లో భారీ ఎత్తున గ్యాస్ నిల్వలను కనుగొనగా అప్పటి నుంచి ఆ దేశం వాటిని పెద్ద ఎత్తున ఎగుమతి చేయడం ప్రారంభించింది. ఇన్‌స్టంట్‌గా అది దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతో లాభం చేకూర్చినా, దీర్ఘకాలిక వృద్ధిలో తీరని నష్టాన్ని మిగిల్చింది. ఓ దశాబ్దం తర్వాత అంటే 1970-77 మధ్యలో పరిశీలిస్తే ఆ దేశ నిరుద్యోగ రేటు 5.1 శాతానికి చేరుకున్నది. అంతకు ముందు అది ఒక శాతానికి మాత్రమే పరిమితమై ఉన్నది. ఎందుకంటే పెట్టుబడులంతా ఒకే రంగంలో కేంద్రీకృతం కావడం, ఇతర రంగాలు, తయారీ పరిశ్రమలను పట్టించుకోకపోవడంతో ఇలాంటి పరిస్థితి ఉత్పన్నమైందని ఆర్థిక విశ్లేషకులు నిర్ధారించారు. అంతేకాకుండా 1908లో ఇరాన్‌లో ఆయిల్ నిల్వలను కనుగొన్నారు. అక్కడ ఇతర రంగాలు అభివృద్ధి చెందకపోవడం, అక్షరాస్యత అంతంతమాత్రంగానే ఉండడంతో పెట్టుబడులు, మానవ వనరులన్నీ 'ఆయిల్' రంగం వైపు మళ్లాయి. దీంతో ఆ దేశ ఆర్థిక వ్యవస్థ మొత్తం ఒకే వనరుపై ఆధారపడి నడపాల్సి వచ్చింది. దీంతో మిగిలిన రంగాలు భారీ నష్టాలను చవిచూశాయి. ఎన్నో సహజ వనరులు, ఖనిజ నిక్షేపాలున్నా అవినీతి, సరైన ప్రణాళిక లేకపోవడంతో కాంగో, జింబాబ్వే లాంటి దేశాలు ఇప్పటికీ పేదరికంలోనే మగ్గుతున్నాయి.

ఇతర దేశాలను పరిశీలిస్తే...

గల్ఫ్ దేశాల కరెన్సీ పూర్తి స్థాయిలో పెట్రో ఉత్పత్తులపై ఆధారపడి ఉన్నది. ఇతర ఎలాంటి వస్తువులను ఆ దేశాలు ఎగుమతి చేయవు. దీంతో 'డచ్ డిసీజ్' లాంటి పరిస్థితులను అవి ఎదుర్కోలేదు. అదే సమయంలో ఆస్ట్రేలియా, నార్వే దేశాలను పరిశీలిస్తే ఖనిజ నిక్షేపాలతోపాటు ఇతర రంగాలపై కూడా దృష్టి సారించాయి. విద్య, మౌలిక సదుపాయాల కల్పనలో పెద్ద ఎత్తున ఖర్చు చేసి 'డచ్ డిసీజ్' లాంటి పరిస్థితులు రాకుండా తప్పించుకోగలిగాయి. అంతేకాకుండా సౌది, దుబాయి, యుఎఇ వంటి దేశాలు తమ ప్రాంతాలను టూరిస్ట్ హబ్ లుగా మార్చి తమ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి.

ఎంత పెద్ద ఎత్తున సహజ వనరులు, ఖనిజ నిక్షేపాలు దొరికినా..పూర్తి స్థాయిలో వాటిపై ఆధారపడకపోవడమే మంచిది. ఆ నిక్షేపాల వద్ద ఒకరిద్దరు వ్యాపారులు మాత్రమే లాభపడేలా కాకుండా...సరైన ప్రణాళికలు రూపొందించి ప్రజలందరికీ లాభం జరిగేలా చర్యలు చేపట్టాలి. ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి లాభాలను విద్య, మౌలిక సదుపాయాల కల్పనలో ఖర్చు చేయాలి. అంతేకాకుండా వివిధ రంగాల్లో పెట్టుబడులు పెడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను వైవిధ్యపర్చాలి. అవినీతికి ఆస్కారం ఇవ్వొద్దు. అప్పుడే అన్ని పరిస్థితులను ఎదుర్కొనేలా దేశ ఆర్థిక వ్యవస్థను తయారు చేయవచ్చు. లేకుంటే ఆ సహజ వనరులు, ఖనిజ నిక్షేపాలే దేశానికి శాపంగా మారుతాయి.

/ వ్యాసకర్త సెల్ : 9640466464 /

★

కవిత్వం



నిజమైన మహిళా దినోత్సవం

దినోత్సవాలు కాదు
కాస్త స్వేచ్ఛనిస్తే చాలు
శాలువాలు కాదు
వలువలకు విలువిస్తే చాలు
పూలమాలలు కాదు
మానాలు కాలరాయకుంటే చాలు
చప్పట్లు కాదు
గుప్పెడంత ధైర్యమిస్తే చాలు
పొగడ్తలు కాదు
అవమానాలు చేయకుంటే చాలు
నమస్కారాలు కాదు
సంస్కారంగా మెలిగితే చాలు
వందనాలు కాదు
అపనిందలు వేయకుంటే చాలు
అభినందనలు కాదు
అనుమానించకుంటే చాలు
స్త్రీ ని స్త్రీ గా గౌరవించిన రోజు
మహిళా దినోత్సవమే ప్రతిరోజు.

- కయ్యూరు బాలసుబ్రమణ్యం
సెల్ : 7780277240

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కినా...

బాజాభజంత్రీలతో స్వాగతం

- బిజెపి ఎమ్మెల్యేనా..మజాకానా...!
- ముందస్తు బెయిల్..
- దర్యాప్తు అధికారుల బదిలీ




బెంగళూరు. ప్రత్యర్థి పార్టీల నేతలపై ఇడి, సిబిఐలను ఉసిగొల్పుతున్న మోడీ ప్రభుత్వం..కర్ణాటకలో బిజెపి ఎమ్మెల్యే మాదాల్ విరూపాక్షప్ప ఇంట్లో నోట్ల కట్టలు దొరికినా.. ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా ఆయనకు ముందస్తు బెయిల్ లభించేదాకా ఎమ్మెల్యే జోలికివెళ్లలేదు. ఇపుడు లంచం కేసులో దర్యాప్తు చేస్తున్న అధికారులనే మార్చేశారు. కర్ణాటక హైకోర్టు బిజెపి ఎమ్మెల్యేకు ముందస్తు బెయిల్ మంజూరు చేసి, దర్యాప్తు అధికారుల ముందు హాజరు కావాలని కోరిన తర్వాత ఇలా బదిలీ జరగటం గమనార్హం. విరూపాక్షప్పపై అవినీతి ఆరోపణలు వచ్చినప్పటి నుంచీ పరారీలో ఉన్నాడు. లంచం కేసులో దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలని కోర్టు బిజెపి ఎమ్మెల్యేను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ లభించడంతో ఆయనకు దావణగెరెలో బిజెపి కార్యకర్తలు, మద్దతుదారుల ఘన స్వాగతం లభించింది. బాజాభజంత్రీలతో ఊరేగించి హంగామా చేశారు. కాగా ఈ కేసు దర్యాప్తులో కీలకపాత్ర పోషించిన అధికారులను మార్చేడం ఇప్పుడు వివాదస్పదంగా మారింది.

రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన పుత్రరత్నం


విరూపక్ష కుమారుడు ప్రశాంత్ మాదాల్ ..సాగయ్ రాజ్ నుంచి రూ. 40 లక్షలు లంచం తీసుకుంటూ లోకాయుక్త జరిపిన దాడిలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన సంగతి విదితమే. క్యాష్ ఫర్ కాంట్రాక్ట్ కుంభకోణంలో లోకాయుక్త గత వారం రూ.8 కోట్లకు పైగా రికవరీ చేసింది. ఆ తర్వాత లంచం కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేసి విరూపాక్షప్పను నంబర్ వన్ నిందితుడిగా పేర్కొన్నారు. అయితే ఈ దర్యాప్తు కీలక పాత్ర పోషించిన విచారణాధికారులు డిప్యూటీ ఎస్పీ ప్రమోద్ కుమార్, ఇన్‌స్పెక్టర్ కుమారస్వామిని మార్చేశారు. వారిస్థానంలో కొత్త దర్యాప్తు అధికారులుగా డిప్యూటీ ఎస్పీ ఆంథోనీ జాన్, ఇన్‌స్పెక్టర్ బాలాజీబాబు నియమించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సోదాల్లో లెక్కాపత్రం లేని రూ.కోట్ల సొమ్ము

విరూపాక్షప్ప ఛైర్మన్‌గా ఉన్న కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్ కార్యాలయంలో లోకాయుక్త అధికారులు ట్రాప్ చేసి లెక్కల్లో చూపని నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. తదుపరి సోదాల్లో కేఎస్‌డీఎల్ కార్యాలయంలో సుమారు రూ.2 కోట్లు, ప్రశాంత్ ఇంటి నుంచి రూ.6 కోట్లకుపైగా స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో రూ.8.23 కోట్ల నగదు, భారీగా బంగారం, వెండి ఆభరణాలు, భూముల్లో పెద్ద మొత్తంలో పెట్టుబడులు బయటపడ్డాయి.

నోట్ల గుట్టలున్న మీ ఎమ్మెల్యేపై చర్యలేవీ ?

- ప్రధాని మోడీకి ఆప్ అధినేత సూటి ప్రశ్న..



న్యూఢిల్లీ : మద్యం కుంభకోణం కేసులో ఏమీ లేని సిసోడియాపై అన్ని కేసులు పెట్టినప్పుడు.. నోట్ల గుట్టలు దొరికిన కర్నాటకలో బిజెపి ఎమ్మెల్యేను ఎందుకు అరెస్టు చేయలేదు? అని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ప్రశ్నించారు. తాజాగా ప్రధాని మోడీకి ఆప్ అధినేత సూటి ప్రశ్న వేశారు. కర్నాటక లో బిజెపి ఎమ్మెల్యే కుమారుడి 'లంచావతరం' ఘటనను ఉదహరిస్తూ తీవ్ర విమర్శలు గుప్పించారు. 'ప్రధాని జీ.. మనీశ్ సిసోడియా నివాసంలో సోదాలు జరిపినప్పుడు అధికారులకు ఏం లభించలేదు. అయినా సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)లోని అన్ని సెక్షన్ల కింద కేసులు పెట్టి ఆయనను అరెస్టు చేశారు. అదే మీ పార్టీ ఎమ్మెల్యే ఇంట్లో సోదాలు చేస్తే పెద్ద మొత్తంలో నగదు బయటపడింది. అయినా ఆయనను ఎందుకు అరెస్టు చేయలేదు? ఇంకెప్పుడూ అవినీతిపై పోరాటం గురించి మాట్లాడకండి. ఆ మాటలు మీకు సరిపోవు" అంటూ ఘాటు విమర్శలు చేశారు.కర్నాటకలోని చెన్నగిరి ఎమ్మెల్యే, బిజెపి నేత మాడాళ్ విరూపాక్షప్ప కుమారుడు ప్రశాంత్ మాడాళ్ ఇటీవల రూ.40 లక్షలు లంచం తీసుకుంటూ లోకాయుక్త పోలీసులకు దొరికిన విషయం తెలిసిందే. దీంతో ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఆయన ఇల్లు, కార్యాలయంలో సోదాలు చేపట్టగా.. రూ.8కోట్లకు పైగా అక్రమ నగదు బయటపడింది. దీంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఎమ్మెల్యే విరాపాక్షప్పపైనా కేసు నమోదు చేశారు. అయితే ఈ ఘటన తర్వాత ఎమ్మెల్యే అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.

సిసోడియా, జైన్ రాజీనామాలకు రాష్ట్రపతి ఆమోదం

న్యూఢిల్లీ : ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, మంత్రి సత్యేంద్ర జైన్ రాజీనామాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోదించారు. వీరిద్దరూ అవినీతి, మనీలాండరింగ్ కేసుల్లో అరెస్టయి ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్న సంగతి తెలిసిందే. వీరి రాజీనామాలను ఆమోదించిన రాష్ట్రపతి ఢిల్లీ మంత్రులుగా ఆప్ ఎమ్మెల్యేలు సౌరభ్ భరద్వాజ్, అతిషి నియామకానికి ఆమోదముద్ర వేశారు. 'ఢిల్లీ ముఖ్యమంత్రి సలహా మేరకు మనీష్ సిసోడియా రాజీనామాను రాష్ట్రపతి ఆమోదించారు. తక్షణం ఇది అమల్లోకి వస్తుంది' అని రాష్ట్రపతి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సత్యేందర్ జైన్ గురించి కూడా ఇలాంటి ప్రకటననే విడుదల చేసింది. జైన్‌ను గతే ఏడాది మే 20న ఇడి అరెస్టు చేయగా, సిసోడియాను ఈ ఏడాది ఫిబ్రవరి 26న సిబిఐ అరెస్టు చేసింది. ఈ నెల ప్రారంభంలో ఇద్దరూ తమ పదవులకు రాజీనామా చేశారు.




మిస్సైల్ స్క్వాడ్రన్ ఇంఛార్జిగా కెప్టెన్ షాలిజ ధామి

- వాయుసేన పోరాట దళ బాధ్యతలు చేపట్టిన తొలి మహిళగా రికార్డు

న్యూఢిల్లీ : భారత వైమానిక దళం (ఐఎఎఫ్) చరిత్రలో సరికొత్త రికార్డు నమోదు అయ్యింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా యుద్ధ రంగంలో ముందుండి పోరాడే పోరాట దళ బాధ్యతలను తొలిసారి ఒక మహిళకు అప్పగించారు. వాయుసేన గ్రూప్ కెప్టెన్ షాలిజ ధామి ఈ రికార్డు కైవసం చేసుకున్నారు. వైమానిక దళంలోని పశ్చిమ విభాగంలో గ్రూప్ కెప్టెన్ గా ఉన్న షాలిజ ధామిని మిస్సైల్ స్క్వాడ్రన్‌కు ఇంఛార్జిగా నియమితులయ్యారు. ఇలా కీలకమైన ఒక కంబాట్ యూనిట్ బాధ్యతలను చేపట్టిన తొలి మహిళగా గ్రూప్ కెప్టెన్ షాలిజ ధామి రికార్డు సష్టించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐఎఎఫ్ ఈ నిర్ణయం తీసుకుంది.

గంటల తరబడి లాలూ విచారణ

- సిబిఐ తీరుపై ఆయన కుమార్తెల ఆగ్రహం



న్యూఢిల్లీ: కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌ను మంగళవారం కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) గంటల తరబడి ప్రశ్నించింది. ఆయన రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో ఉద్యోగాలు ఇప్పించేందుకు కొంతమంది అభ్యర్థుల నుంచి భూములు తీసుకున్నారని అభియోగాలు నమోదయ్యాయి. ఈ విచారణ లాలూ కుమార్తె మీసా భారతి ఇంట్లో కొనసాగింది. శస్త్ర చికిత్స అనంతర ఇబ్బందులతో బాధపడుతున్న తన తండ్రిని విచారణ పేరిట ప్రశ్నించడం కచ్చితంగా వేధింపులకు గురి చేయడమేనని మీసా భారతి ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తండ్రిని నిరంతరం వేధిస్తున్నారని, ఆయనకు ఏదైనా జరిగితే ఎవర్నీ వదలనని ఆమె హెచ్చరించారు. ఈ మేరకు వరుస ట్వీట్లు చేశారు. లాలూకు కిడ్నీ దానం చేసిన ఆయన రెండో కుమార్తె రోహిణి అచార్య కూడా తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'తన తండ్రిని వేధిస్తోన్న తీరు సరికాదు. ఇవన్నీ గుర్తుంటాయి. సమయం అన్నింటికంటే శక్తివంతమైంది. ఆయనకు దిల్లీలోని పీఠాన్ని కదిలించే శక్తి ఇప్పటికీ ఉంది' అని అన్నారు. అలాగే సహనానికి కూడా హద్దు ఉంటుందని, దాన్ని కూడా పరీక్షిస్తున్నారంటూ రోహిణీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే.. సింగపూర్‌లో విజయవంతంగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స అనంతరం లాలూ ప్రసాద్ ఇటీవలే స్వదేశానికి తిరిగొచ్చారు.

కేసు నేపథ్యం..

2004 నుంచి 2009 వరకు యుపిఎ హయాంలో లాలూ రైల్వే మంత్రిగా ఉన్నారు. ఈ క్రమంలోనే 2008-09 మధ్య రైల్వే ఉద్యోగాలకు నియామక ప్రక్రియ జరగ్గా.. కొందరు అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు వారి నుంచి లాలూ కుటుంబం భూములు, ఇతర ఆస్తులను లంచంగా తీసుకున్నట్లు వచ్చిన ఆరోపణలపై గతంలో సిబిఐ కేసు నమోదుచేసింది. లాలూతో పాటు ఆయన భార్య రబ్రీదేవి, మరో 14 మందిపై చార్జిషీటు దాఖలు చేసింది. సోమవారం రబ్రీని ఆమె నివాసంలో ప్రశ్నించిన సిబిఐ.. ప్రస్తుతం లాలూను విచారిస్తోంది.

ఢిల్లీ మద్యం కుంభకోణంలో అరుణ్ రామచంద్ర పిళ్లై అరెస్టు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) తాజాగా మరో కీలక వ్యక్తిని అరెస్ట్ చేసింది. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త అరుణ్ రామచంద్ర పిళ్లైను ఇటీవల రెండు రోజుల పాటు ప్రశ్నించిన ఇడి అధికారులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చారు. 'బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రతినిధిగా అరుణ్ రామచంద్ర పిళ్ళై అంగీకరించారు. ఆయనను ఏడు రోజుల కస్టడీకి ఇవ్వండి. కేసు దర్యాప్తునకు ఆయన పూర్తిగా సహకరించడం లేదు. ఆర్థిక లావాదేవీలపై ఆరా తీయడానికి కస్టడీ అవసరం. రూ.25 కోట్లు నేరుగా బదిలీ అయ్యాయి' అంటూ ఇడి కోర్టు ఎదుట తన వాదనలు వినిపించింది. ఇందుకోసం సమర్పించిన 17 పేజీల రిమాండ్ రిపోర్టులో ఇడి పలు కీలక విషయాలు పేర్కొంది. ఎమ్మెల్సీ కవితకు లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతోనే పిళ్లై అన్నీ తానై వ్యవహరించారని ఆరోపించింది. ఆప్ నేతలకు రూ.100 కోట్లు ఇచ్చినట్లు అరుణ్ దర్యాప్తులో అంగీకరించారనీ, రూ.100 కోట్లు పెట్టుబడి పెట్టి రూ.292 కోట్లు సంపాదించారనీ ఇడి తెలిపింది. తాను కవిత బినామీ అని అరుణ్ విచారణలో పలు సందర్భాల్లో అంగీకరించినట్లు ఇడి పేర్కొంది. సౌత్‌గ్రూప్ వ్యక్తుల సంస్థలన్నీ కలిసి రూ.3,500 కోట్ల వ్యాపారం చేశాయని ఇడి తెలిపింది. దీంతో రామచంద్ర పిళ్లైకి రౌస్ అవెన్యూ కోర్టు ఏడు రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించింది. రామచంద్ర పిళ్లై అరెస్ట్‌తో మద్యం విధానం మనీలాండరింగ్ కేసులో అరెస్టుల సంఖ్య 10కి చేరింది.

జమ్ముకాశ్మీర్‌లో స్థంభించిన రెవిన్యూ కార్యకలాపాలు

- వారం రోజులుగా సమ్మె చేస్తున్న పట్వారీలు
- సిపిఎం నేత యూసఫ్ తరిగామి మద్దతు



శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో రెవిన్యూ విభాగంలో సేవలందిస్తున్న 'పట్వారీ'లు వారం రోజులుగా సమ్మె కొనసాగిస్తుండటంతో కార్యకలాపాలు పూర్తిగా స్థంభించిపోయాయి. వేతనాలు, అద్దె పెంపు, మౌలిక సదుపాయాల కల్పన తదితర న్యాయ బద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని పట్వారీలు సమ్మె చేస్తున్నారు. దీంతో రెవెన్యూ శాఖలో కార్యకలాపాలు స్థంభించిపోయి.. స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పట్వారీల న్యాయ సమ్మతమైన డిమాండ్లన్నిటినీ నెరవేర్చాలని సిపిఎం నాయకులు, మాజీ ఎమ్మెల్యే మహ్మద్ యూసఫ్ తరిగామి డిమాండ్ చేశారు. పట్వారీల న్యాయసమ్మతమైన పోరాటానికి ఆయన మద్దతు ప్రకటించారు. పట్వారీల సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని పాలనాయంత్రాంగాన్ని ఆయన కోరారు. పట్వారీల సమస్యల పరిష్కరిస్తామని హామీలు, వాగ్దానాలు ఇస్తూ వాటిని నెరవేర్చకుండా మభ్యపెడుతూ వచ్చినందునే సమ్మె చేపట్టాల్సివచ్చిందని ఆయన తెలిపారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. గ్రాడ్యుయేట్ పట్వారీలకు వేతన స్కేలును పెంచాలని, సకాలంలో ఉద్యోగోన్నతి కల్పించాలని, అలాగే పట్వార్ ఖానాలకు అద్దె చెలింపులు, నూతన పట్వార్ ఖానాల నిర్మాణం వంటి డిమాండ్లన్నిటినీ నెరవేర్చాలని తరిగామి కోరారు. జమ్ముకాశ్మీర్ వ్యాప్తంగా కొనసాగుతున్న పట్వారీల సమ్మె మంగళవారానికి ఏడో రోజుకు చేరుకుంది.



వలస కార్మికులకు స్టాలిన్ భరోసా

చెన్నై : తమిళనాడులోని తిరునెల్వేలి జిల్లాలో వలస కార్మికులను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ మంగళవారం కలిసి వారిలో మనోధైర్యం నింపారు. 'మిమ్మల్ని రక్షించడానికే మేం ఇక్కడ ఉన్నాం. మీరు భయపడాల్సిన అవసరం లేదు' అని భరోసా ఇచ్చారు. తమిళనాడులో వలసకార్మికులపై దాడులు జరుగుతున్నాయని ఇటీవల బిజెపి విష ప్రచారం చేస్తున్న నేపథ్యంలో జిల్లాలోని కావల్కినరు వద్ద సర్జికల్ గ్లవ్స్ తయారీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులతో స్టాలిన్ సంభాషించారు. కార్మికులకు ఆహారం, వసతి, పని పరిస్థితులు, పని గంటలు, యాజమాన్యం కల్పిస్తున్న ఇతర సౌకర్యాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. తాము సురక్షితంగా ఉన్నామని కార్మికులు తెలిపారు. ఈ పరిశ్రమలో దాదాపు 450 మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరిలో సుమారు 200 మంది బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ నుంచి వలస కార్మికులని యాజమాన్యం తెలిపింది.

ఢాకాలో పేలుడు


17 మంది మృతి

100 మందికి పైగా గాయాలు

ఢాకా: బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో మంగళవారం భారీ ప్రమాదం సంభవించింది. రద్దీగా ఉండే ప్రాంతంలోని ఏడు అంతస్తుల భవనంలో జరిగిన పేలుడు ఘటనలో 17మంది మరణించారు. మరో 100 మంది పైగా గాయపడ్డారు. సాయంత్రం 4.50 గంటల సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పాత ఢాకాలోని గౌలిస్తాన్ ప్రాంతంలో ఈ ప్రమాదం గురించి తెలిసినవెంటనే అగ్నిమాపక సిబ్బంది, సహాయక సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. మంటలను అదుపు చేయడానికి తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు. క్షతగాత్రులను ఢాకా వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని చెప్పారు. పేలుడుకు గల కారణాలు ఈ వార్త రాసే సమయానికి వెల్లడికాలేదు. ఈ పేలుడు ధాటికి భవనంలోని తొలి రెండు అంతస్తులు తీవ్రంగా ధ్వంసమయ్యాయని అధికారులు చెప్పారు. ఈ భవనంలోని కింది అంతస్తులో శానిటరీ ఉత్పత్తులు, గృహోపకరణాలకు సంబంధించిన దుకాణాలు ఉండగా భవనం పక్కనే ఓ బ్యాంకు శాఖ ఉంది. బ్యాంక్ భవనం కూడా దెబ్బతింది.

ఆసియాలో ఉక్రెయిన్ తరహా సంక్షోభాన్ని అనుమతించం

- పశ్చిమ దేశాలు ప్రచ్ఛన్న యుద్ధ మనస్తత్వాన్ని వీడాలి
- మీడియా గోష్టిలో చైనా విదేశాంగ మంత్రి కిన్ గాంగ్



బీజింగ్ : తైవాన్ అంశాన్ని ముందుకు తేవడం ద్వారా ఆసియాలో ఉక్రెయిన్ తరహా సంక్షోభాన్ని పునరావృతం చేయాలని చూస్తే సహించేది లేదని చైనా హెచ్చరించింది. అమెరికా తన ప్రపంచాధిపత్యం కోసం ఉక్రెయిన్‌ను ఓ ప్రయోగశాలగా చేసుకుని యుద్ధాన్ని కొనసాగిస్తున్న నేపథ్యంలో చైనా ఈ హెచ్చరిక చేసింది. నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పిసి) సమావేశాలు జరుగుతున్న సందర్భంగా చైనా విదేశాంగ మంత్రి కిన్ గాంగ్ మంగళవారం నాడిక్కడ మీడియా గోష్టి నిర్వహించి కీలకమైన అంతర్జాతీయ సమస్యలపై చైనా వైఖరిని పునరుద్ఘాటించారు. చైనా-రష్యా బంధం వల్ల ఏ దేశానికి ఎలాంటి ముప్పు ఉండబోదన్నారు. మూడవ పక్షంగా ఇతర దేశాల వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం, అసమ్మతిని ఎగదోయడం వంటి చర్యలకు తాము పూర్తి వ్యతిరేకమని అన్నారు. ప్రపంచానికి ద్రవ్యోల్బణం ఇప్పుడొక పెను ముప్పుగా పరిణమించిందని అన్నారు. పశ్చిమ దేశాలు తమ ప్రచ్ఛన్న యుద్ధ మనస్తత్వాన్ని వీడాలని, ఈ విషయంలో ప్రజల వాణిని అవి చెవికెక్కించుకోవాలని ఆయన హితవు పలికారు. తైవాన్ వ్యవహారంలో జోక్యం చేసుకునే హక్కు ఏ దేశానికి లేదని ఆయన మరోసారి ఉద్ఘాటించారు. తైవాన్ అంశం చైనా అంతర్గత వ్యవహారమని ఆయన పేర్కొన్నారు. ఉక్రెయిన్ సంక్షోభం ప్రపంచ ప్రజానీకంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోందని, యూరప్‌లో సెక్యూరిటీ గవర్నెన్స్ పెరిగిపోతోందని అన్నారు. యుద్ధం కన్నా శాంతికి, ఆంక్షల కన్నా చర్చలకు, రెచ్చగొట్టే చర్యల కన్నా చర్చలకే తాము అధిక ప్రాధాన్యమిస్తామన్నారు. చైనా దౌత్యంలో దయ, సుహృద్భావాలకు కొదవ లేదు, అయితే జిత్తులమారి నక్కలు, తోడేళ్ల వంటి వాటిని ఎదుర్కోవాల్సి వచ్చినప్పుడు వాటితో ఘర్షణ పడడం తప్ప చైనాకు మరో మార్గం లేదన్నారు. మాతృ భూమి రక్షణకు వారితో ముఖాముఖి తలపడక తప్పదని ఆయన తేల్చి చెప్పారు.

చైనా ఆధునీకీ కరణ అంటే శాంతి, అభివృద్ధి, సహకారం, పరస్పర ప్రయోజనాలు, మానవాళికి ప్రకృతికి మధ్య సామరస్యత ద్వారా సాధించేదే తప్ప యుద్ధం, వలసాధిపత్యం, వనరులను కొల్లగొట్టడం వంటి వాటికి పాల్పడడం కాదని కిన్ గాంగ్ అమెరికానుద్దేశించి వ్యంగ్యంగా అన్నారు. పశ్చిమ దేశాల ఆధునీకరణకు భిన్నమైన కొత్త పంథా తమది అని ఆయన చెప్పారు. బెల్ట్ అండ్ రోడ్డు ఇనిషియేటివ్ ఉన్నత ప్రమాణాలతో, మంచి ఉద్దేశంతో చేపట్టినదన్నారు. మిగిలిన భాగస్వాములనందరినీ కలుపుకుంటూ, దాని వల్ల వచ్చే ప్రయోజనాలు ప్రపంచంతో పంచుకుంటుందని అన్నారు. అభివృద్ధి చెందిన దేశాలు ప్రపంచ జనాభాలో 80 శాతానికి, ప్రపంచ ఆర్థికాభివృద్ధిలో 70 శాతానికిపైగా ప్రాతినిధ్యం కలిగి వున్నాయని, కాబట్టి వర్ధమాన దేశాల ప్రజలు మెరుగైన జీవితం కలిగివుంటే హక్కును కోరుకోవడం తప్పేమీ కాదన్నారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో వర్ధమాన దేశాలు తమ వాణిని గట్టిగా వినిపించే అవకాశం ఉండాలని, తగిన ప్రాతినిధ్యం కూడా ఉండాల్సిన అవసరముందన్నారు.

వారు మమ్మల్ని అణగదొక్కాలని చూస్తున్నారు
అమెరికా వైఖరిపై మండిపడ్డ చైనా

ఇండో-పసిఫిక్ వ్యూహం ద్వారా 'చైనాను ముట్టించడానికి' అమెరికా ప్రయత్నిస్తోందని కిన్ గాంగ్ విమర్శించారు. "ప్రత్యేకమైన బ్లాక్‌లను ఏర్పాటు చేసి, ఘర్షణలను రెచ్చగొట్టి, ప్రాంతీయ సమగ్రతకు విఘాతం కలిగించాలన్నదే అమెరికా అనుసరించే ఇండో-పసిఫిక్ వ్యూహం లక్ష్యం." అని అన్నారు. "ప్రాంతీయ భద్రతను పరిరక్షించేందుకే ఇండో-పసిఫిక్ వ్యూహం అని వారు చెబుతున్నారు, కానీ, వాస్తవానికి, ఆ వ్యూహం ఘర్షణలను రెచ్చగొడుతోంది. నాటోకు ఆసియా-పసిఫిక్ వర్షన్‌ను సృష్టించాలని భావిస్తోంది." అని చైనా విదేశాంగ మంత్రి అన్నారు. క్వాడ్,అకస్ (ఆస్ట్రేలియా, బ్రిటన్, అమెరికా) గ్రూపులను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ఎన్‌పిసి సమావేశాల సందర్భంగా ప్రతినిధి బృందాన్ని ఉద్దేశించి అధ్యక్షుడు జిన్‌పింగ్ చేసిన ప్రసంగంలో అమెరికాను నేరుగా విమర్శనాస్త్రాలు సంధించారు. చైనాను అన్ని విధాలుగా అదుపు చేయాలని, అణగదొక్కాలని అమెరికా నేతృత్వంలోని పశ్చిమ దేశాలు ప్రయత్నిస్తున్నాయని ఆయన అన్నారు. భారత్‌తో సంబంధాలపై కిన్ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. బైడెన్ ప్రభుత్వం అనుసరిస్తున్న చైనా విధానం అసలు ఉద్దేశం తమను అన్ని రంగాల్లో అణగదొక్కాలన్నదేనని ఆయన విమర్శించారు.

సిసోడియాపై వేధింపులు ఆపండి

మోడీకి విజయన్ లేఖ

తిరువనంతపురం : ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాపై విచారణకు సంబంధించి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి లేఖ రాశారు. అనవసరమైన అరెస్టులు మానుకోవాలని, సిసోడియాపై రాజకీయ వేధింపులకు స్వస్తి పలకాలని లేఖలో ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాజ్యాంగంలోనిసమాఖ్య సూత్రాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఉండాలని లేఖలో స్పష్టం చేశారు. సిసోడియా విషయంపై ప్రధానమంత్రికి లేఖ రాసినందుకు విజయన్‌కు ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో ప్రతిపక్ష నాయకుల అక్రమ అరెస్టులకు వ్యతరేకంగా స్వరం వినిపించినందుకు కృతజ్ఞతలు చెప్పారు.

స్విగ్గీ యాడ్‌పై వివాదం

న్యూఢిల్లీ : ప్రముఖ హోం డెలివరీ సంస్థ 'స్విగ్గీ' హోళీ సందర్భంగా వివాదంలో చిక్కుకుంది. 'కోడి గుడ్లను ఆమ్లేట్ వేసుకోవడానికి వినియోగించండి..ఇంకొకరి తలపై కొట్టడానికి కాదు' అని అర్థం వచ్చేలా హోళీ సందర్భంగా ఢిల్లీలోని పలుచోట్ల ఇన్‌స్టామార్ట్ హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. భారత సంస్కృతీ, సంప్రదాయాలను అగౌరవ పర్చేలా రూపొందించిన ఈ హోర్డింగ్‌ను తొలగించాలని సోషల్ మీడియాలో పలువురు డిమాండ్ చేశారు. 'స్విగ్గీ మాకు నీతులు చెప్పే అర్హత నీకెక్కడిది' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. దీంతో దీనిపై అధికారికంగా స్విగ్గీ తన ప్రకటన విడుదల చేయకపోయినా ఢిల్లీలో ఏర్పాటు చేసిన విదాస్పద హోర్డింగ్‌లను మాత్రం తొలగించింది.

పెండింగ్ బకాయిలు చెల్లిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ.. ఉద్యోగులకు సంబంధించి రూ.16 వేలకోట్లు బిల్స్ పెండింగ్‌లో ఉన్నాయని, ఇందులో సుమారు రూ.3 వేలకోట్లు బిల్లులు ఈనెలాఖరులోగా క్లియర్ చేస్తామని మంత్రివర్గ ఉపసంఘం హామీ ఇచ్చిందన్నారు. డిఎ ఎరియర్స్‌కు సంబంధించి రూ.5 వేలకోట్ల వరకు బకాయిలున్నాయని, వాటిని ఆరు నెలల్లోగా రెండు విడతలుగా క్లియర్ చేస్తామని ప్రభుత్వం పేర్కొందన్నారు. మెడికల్ డిపార్టుమెంట్లో పనిచేసే ఉద్యోగులకు బయోమెట్రిక్ తీసి వేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరామని, ఇందుకు మంత్రివర్గ ఉపసంఘం సానుకూలంగా స్పందించిందన్నారు.

ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సిపిఎస్ రద్దుపై త్వరలో క్లారిటీ ఇస్తామని మంత్రివర్గ ఉపసంఘం పేర్కొందన్నారు. గత సమావేశాలకు భిన్నంగా ఈ దఫా ఆర్థికపరమైన అంశాలపై సుదీర్ఘంగా చర్చించామన్నారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బులు ఈ నెలాఖరులోగా చెల్లిస్తామన్నారు. తాము ముందుగా ప్రకటించిన విధంగానే ఈ నెల 9 నుంచి ఉద్యమ కార్యాచరణ యథావిధిగా కొనసాగుతుందన్నారు. చర్చల సారాంశాన్ని తమ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులకు తెలియజేసేందుకు రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసి చర్చించిన అనంతరం ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈలోగా ప్రభుత్వం ఇచ్చిన హామీలపై లిఖితపూర్వక సమాధానం తమకు అందజేయాలని బొప్పరాజు పేర్కొన్నారు. సెక్రటేరియట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కాకర్ల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారన్నారు. ఉగాది లోగా డిఎ జిఓ ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఔట్‌సోర్సింగ్ మహిళా ఉద్యోగులకు కూడా ఐదు రోజులు స్పెషల్ క్యాజువల్ లీవ్స్‌కు సంబంధించి త్వరలో జిఓ ఇస్తామని చెప్పారన్నారు.

31లోగా చెల్లింపులు జరిగే ఖాతాలు

మెడికల్ రీయంబర్స్‌మెంట్ పెండింగ్ : రూ.55 కోట్లు
ఇహెచ్ఎస్ : రూ.108 కోట్లు
ఎపిజిఎల్ఐ : రూ.382 కోట్లు
టిఎ బిల్స్ : రూ.165 కోట్లు
జిపిఎఫ్ లోన్లు: రూ.1984 కోట్లు
పెన్షనర్లకు సరెండర్ల లీవ్స్‌కు సంబంధించినది : రూ.113 కోట్లు
గ్రాట్యూటీ : రూ.200 కోట్లు

ఇరాక్‌లో అమెరికా రక్షణ మంత్రి ఆకస్మిక పర్యటన

బాగ్దాద్ : అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ మంగళవారం ఇరాక్‌లో ఆకస్మికంగా పర్యటించారు. అమెరికా నేతృత్వంలో ఇరాక్‌పై దాడి జరిగి సద్దాం హుస్సేన్ ప్రభుత్వాన్ని కూల్చివేసిన దాదాపు 20 ఏళ్ళ తర్వాత అమెరికా మంత్రి పర్యటన చోటు చేసుకుంది. అవసరమైతే దేశంలో తన మిలటరీ బలగాలు వుంటాయని హామీ ఇచ్చారు. 2003లో ఇరాక్‌పై జరిగిన దాడిలో వేలాదిమంది ఇరాకీ పౌరులు మరణించిన సంగతిత తెలిసిందే. ఇరాకీ ప్రధాని మహ్మద్ అల్ సుడానీతో సమావేశమైన తర్వాత ఆస్టిన్ విలేకర్లతో మాట్లాడారు. ఇరాక్ భద్రతకు, సుస్థిరతకు, సార్వభౌమాధికారానికి మద్దతుగా అమెరికా కృషి చేస్తుందని ఆస్టిన్ చెప్పారు.

ప్రచండను విచారించాలని సుప్రీంలో రిట్

ఖాట్మండు : నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహల్ అలియాస్ ప్రచండపై దర్యాప్తు జరిపి, అరెస్టు చేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. నేపాల్‌లో దశాబ్ద కాలం పాటు సాగిన మావోయిస్టుల తీవ్రవాదంలో 5 వేల మంది ప్రజలను హతమార్చినందుకు బాధ్యతగా ఆయనపై విచారణ జరపాలని పిటిషన్‌లో కోరారు. న్యాయవాది జ్ఞానేంద్ర అరన్, మావోయిస్టుల తీవ్రవాదంలోని ఇతర బాధితులు ఈ పిటిషన్ వేశారు.

ముందు యుగం దూతలు



ఎందరో మహిళలు
ముందు యుగం దూతలు
కట్టుబాట్లు ఛేదించి
ఆధునికత రంగరించి
ఆత్మాభిమానం
కాపాడుకుంటూ
ఆదర్శంగా నిలిచారు

కాకతీ రుద్రమ్మ
శత్రు మూకలను
చీల్చి చెండాడే
మగువమాంచాలి
వీర తిలకం దిద్ది
మగని రణరంగముకు పంపే

ఝాన్సీ లక్ష్మీబాయి
బ్రిటిష్ వారికి
ఎదురు నిలిచి పోరాడే
కవయిత్రి మొల్ల
చక్కని కవనము రాసే
రామాయణం అందించే

మదర్ థెరీసా
సేవకు నిలువెత్తు రూపం
నోబుల్ బహుమతికి వన్నె తెచ్చే

కల్పనా చావ్లా సునీత
విలియమ్స్
అంతరిక్ష యానంతో
మహిళ తెగువ చూపించే

సంగీత సామ్రాజ్ఞి
ఎమ్మెస్ సుబ్బలక్ష్మి
అద్భుత రాగాలు పలికించే
యామిని కృష్ణమూర్తి
నాట్యరీతులలో
నవ్యత చేకూర్చే

సుధా చంద్రన్
నాట్య మయూరై
అంగవైకల్యం జయించే
మేరీకామ్

వివక్షతను గెలిచి
భారత కీర్తి పతాక ఎగుర వేసే


కవికోకిల సరోజినీ నాయుడు
దుర్గాబాయి దేశ్ ముఖ్
భారత స్వాతంత్ర్యోద్యమంలో
స్ఫూర్తి ని రగిలించే
గణిత మేధావి శకుంతల దేవి
గణితంలో పదనిసలు
ప్రపంచానికి చాటే

సావిత్రి భాయ్ పూలే
బాలిక విద్యకు
అందించే చేయూత
సాహసమే ఊపిరిగా
బచేంద్రిపాల్
ఎవరెస్టు అధిరోహించే

ఎందరో మహిళలు
ముందు యుగం దూతలు
వివక్షత కు ఎదురు నిలిచి
ఆత్మవిశ్వాసంతో అడుగు లేసి
అద్భుతాలు సృష్టించిన
మహిళా శక్తి కి వందనం

- మొర్రి గోపి
88978 82202


సరైన నీడ ఏది?



చిన్నారులూ, ఇక్కడ ఒక పిట్ట ఉంది. దాని పక్కనే కొన్ని నీడలు ఉన్నాయి. వాటిలో దీని సరైన నీడను కనిపెట్టండి.

జవాబు: 4

నేను గీసిన బొమ్మ



తేజస్విన్,
3వ తరగతి,
వివేకానంద హై స్కూలు,
పాలకొండ, పార్వతీపురం,
మన్యం జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



సమానత్వ సాధనలో ...

ఇరవై ఒకటో శతాబ్దంలో ఉన్నా నేటికీ మహిళలు వివక్ష నిండిన సమాజంలో జీవిస్తున్నారు. స్థిరమైన, ప్రశాంతమైన భవిష్యత్తు కోసం ప్రపంచవ్యాప్తంగా ప్రతి మహిళా ప్రతిరోజూ యుద్ధమే చేయాల్సి వస్తోంది. ఎన్నో అద్భుతాలకు చిహ్నంగా నిలుస్తున్నా సమాజం ఆమె పట్ల చూపిస్తున్న ధోరణి మారడం లేదు. పుట్టుక మొదలు ఎదిగే ప్రతి దశలో వివక్షకు గురౌతోన్న మహిళలు కుల, మత, జాతి వివక్షలకు తోడు లింగ వివక్షతో నిత్యం వేధింపుల పాలౌతున్నారు. ఈ పెడ ధోరణి ఇంకెంత కాలమో సాగడానికి వీలులేదు. సమాన హక్కులు, సమాన హోదా కోసమే కాదు సమాన గుర్తింపు కోసం పోరాడవలసిన తరుణమిది.



గతంలో ఆడపిల్లలను ఉన్నత విద్యకు పంపించాలంటే తల్లిదండ్రులు తటపటాయించేవారు. కాని ఇప్పుడు పరిస్థితి మారింది. ఆడపిల్లలు ఉన్నతవిద్యలో రాణిస్తున్నారు. కాని కులం పేరుతో, మహిళ అన్న చిన్నచూపుతో తెలంగాణకు చెందిన మెడికో ప్రీతిపై సీనియర్ వైద్యుడు చేసిన వేధింపుల కారణంగా ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. ఆ దుర్ఘటన ఆడపిల్లల తల్లిదండ్రులను ఎంతో భయభ్రాంతులకు గురిచేసింది. ఎంతోమంది ఉన్నత విద్యావంతులు ఉన్న విశ్వవిద్యాలయంలో ఇటువంటి వేధింపులు బయటపడడం వెనుక మహిళలను చిన్నచూపు చూసే ధోరణి సమాజంలో ఎంతలా వేళ్లూనుకుందో తెలియజేస్తుంది.

నిందితులకు అండగా..

రోజురోజుకూ మహిళలపై అరాచకాలు, అకృత్యాలు విశృంఖలమవుతున్నాయి. బాధితులకు అండగా నిలబడాల్సిన యంత్రాంగం నిందితులకు కొమ్ముకాస్తోంది. మూడేళ్ల క్రితం జరిగిన హత్రాస్ ఘటనలో అత్యంత పాశవికంగా అత్యాచారానికి గురై మరణించిన బాధితురాలి కేసులో అరెస్టైన నలుగురు నిందితుల్లో ముగ్గురిని ఎటువంటి ఆధారాలూ లేవన్న కారణంగా నిర్దోషులుగా విడుదల చేశారు. అంతకుముందు స్వాతంత్ర్య దినోత్సవ సాక్షిగా 18 ఏళ్ల క్రితం కర్కశమూక పాశవిక దాడికి బలైన బిల్కిస్ బానో కేసులో కూడా ఏ నేరమూ చేయలేదని, నిర్దోషులని ముద్రవేసి నిందితులకు పూలదండలు మిఠాయిలు తినిపించి విడుదలచేశారు. బాధితులు మరణించినా, జీవించినా వారికి జరిగే న్యాయం ఇదేనని ఈ రెండు కేసుల్లో స్పష్టమౌతోంది. ఈ ఇద్దరు మహిళలే కాదు, తమపై జరిగిన అన్యాయాలను ఎదిరించి పోరాడిన ఎంతోమంది మహిళల పరిస్థితి ఇదే.

రెండవ శ్రేణికే పరిమితం..

సమాజంలో ఆమె స్థానం ఇప్పటికీ రెండవశ్రేణికే పరిమితం చేస్తున్నారు. ఏ రంగంలో ఉన్నా ఆమె ప్రతిభ వివక్షతో ముడిపడి ఉంటోంది. కూలీనాలీ చేసుకునే మహిళల దగ్గర్నుంచి, శ్రామికురాలిగా, అధికారిగా, న్యాయమూర్తిగా, ప్రజాప్రతినిధిగా ఎంతో ఎత్తుకు ఎదుగుతున్నా పురుషుని తరువాతే ఆమె స్థానం. బిడ్డల పెంపకం, కుటుంబ సంరక్షణకే పరిమితం చేసేవారు ఈ సమాజంలో ఎంతోమంది.

పోరాడి గెలుస్తున్నారు..

పొలం దున్నేందుకు ఆడపిల్లలు పనికిరారన్న జార్ఖండ్‌లోని ఓ ఊరిపెద్దలకు ఎదురు నిలిచి వ్యవసాయం చేసి తన సత్తా చూపింది మంజు అనే యువతి. భర్త చనిపోయిన స్త్రీ శుభకార్యాలకు పనికిరాదన్న సమాజాన్ని వ్యతిరేకించి పెళ్లి దుస్తులు తయారుచేసి పద్మశ్రీ అందుకుంది మణిపూర్‌కు చెందిన 90 ఏళ్ల బామ్మ రాధేశర్మ. ఊళ్లో వరుసగా చావులు, రోగాలు సంభవిస్తుంటే.. ఆమెను కేంద్రంగా చేసి హింసించిన ఊరినే సంస్కరించి ధీరవనితగా నిలిచింది జార్ఖండ్‌కు చెందిన మరో మహిళ చుట్నీ మహతో. ఇలా తమను తాము సంరక్షించుకుంటూ.. సమాజాన్ని సంస్కరించడంలో ఎన్ని అవరోధాలైనా ఎదుర్కొనేందుకు మహిళలు సిద్ధంగా ఉంటారు. సమాన హక్కులు, వేతనాలు, ఓటు హక్కు కోసం పోరాడి గెలిచిన మహిళలు సమాన గుర్తింపు కోసం ఉద్యమించాల్సిన తరుణమిది. మహిళా దినోత్సవాన ధీరవనితలందరికీ శుభాకాంక్షలు..



సమాన గుర్తింపు ఇవ్వాలి..



పని గంటలు తగ్గించాలని, వేతనాలు పెంచాలని, ఓటు హక్కు కావాలని క్లారా జట్కిన్ నాయకత్వాన ఎన్నో పోరాటాలు చేసిన తరువాత నుండే మహిళా దినోత్సావాన్ని జరుపుకోవడం మొదలైంది. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. అంతరిక్షంలోకి వెళుతున్నారని చెబుతూ మహిళా దినోత్సవం జరుపుకోవడం సరికాదు. నచ్చలేదని, ఎదురు మాట్లాడిందని, ముక్కలు ముక్కలుగా నరికిపారేస్తున్నారు. ఆడపిల్ల పుట్టిన దగ్గర నుండి పెరుగుతున్న ప్రతి దశలోనూ వివక్షకు గురౌతోంది. మహిళను మహిళగా కంటే మనిషిగా గుర్తించాలి. ఇంటిపనుల్లో.. ఆఫీసు పనుల్లో సమాన హోదాల్లో సమానత్వం సాధించడం కాదు, ఆమెకు సమాన గుర్తింపు ఇవ్వాలి. అప్పుడే సమానత్వానికి సరైన అర్థం. ఆమెకు అన్యాయం జరిగినప్పుడు అన్నివైపుల నుండి స్పందన రావాలి. ఆధునిక, సాంకేతిక రంగాల్లో ఎంతో ముందంజలో ఉన్న నేటి సమాజంలో ఇప్పటికీ మహిళల పట్ల చిన్నచూపు తగ్గలేదు. సమాజంలో వేళ్లూనుకున్న ఈ భావన పోవాలి. ఆ ధోరణి పోకుండా మహిళా దినోత్సవాలు జరుపుకోవడంలో అర్థం లేదు.

– పుతుంబాక భారతి,
ఐద్వా సీనియర్ నాయకులు,
మాజీ ఎమ్మెల్యే, సత్తెనపల్లి.

భారత్‌లో నియంతృత్వం !

- టాప్-10లో చోటు
- వి-డెమ్ నివేదిక

న్యూఢిల్లీ : భారత్‌లో ప్రజాస్వామ్యం దెబ్బతింటోంది..నియంత తరహా పాలన బలపడుతోందని 'వి-డెమ్' నివేదిక తెలిపింది. ప్రజాస్వామ్య సూచికల్లో గత 10 ఏళ్లుగా భారత్ స్థాయి వేగంగా పడిపోతోందని హెచ్చరించింది. 'మతస్వేచ్ఛ' పట్టికలో అట్టడుగునకు చేరుకుంది. పౌర హక్కులు, వాక్ స్వాతంత్ర్యం, ఎన్నికల ప్రజాస్వామ్యం, బలమైన రాజ్యాంగ సంస్థలు..ఇలా అనేక విషయాల్లో భారత్ గణనీయంగా వెనుక పడింది. ఈ ఏడాది లిబరల్ డెమొక్రసీలో భారత్ కు 97వ స్థానం, ఎలక్టోరల్ డెమొక్రసీలో 108వ స్థానం, సమానత్వంలో 123వ స్థానం... ఊహించిందేనని 'వి-డెమ్' పేర్కొంది. స్వీడన్‌కు చెందిన 'యూనివర్సిటీ ఆఫ్ గోతెన్‌బర్గ్' పరిశోధకులు ప్రతిఏటా ఈ నివేదికను రూపొందిస్తారు.

ప్రపంచవ్యాప్తంగా..

2022 నాటికి మొత్తం ప్రపంచ జనాభాలో 72 శాతం మంది (సుమారుగా 570 కోట్ల మంది) నియంతృత్వ దేశాల్లో నివసిస్తున్నారు. కేవలం 13 శాతం ప్రజలు స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్య దేశాల్లో జీవిస్తున్నారు. 35 దేశాల్లో వాక్ స్వాతంత్ర్యం క్షీణిస్తోంది. 45 దేశాల్లో మీడియాపై సెన్సార్‌షిప్ పెరిగింది. 37 దేశాల్లో పౌర హక్కులకు తీవ్రస్థాయిలో విఘాతం కలిగింది. కాగా అర్మేనియా, గ్రీస్, మారిషస్..తదితర దేశాల్లో ప్రజాస్వామ్యం వేగంగా బలహీనపడుతోందని వి-డెమ్ పేర్కొంది.

కోవిడ్-19 పేరుతో..

అనేక దేశాల్లో ప్రభుత్వాలు కోవిడ్-19 సంక్షోభాన్ని సాకుగా చూపి పౌరుల స్వేచ్ఛ, హక్కుల్ని బలహీనపర్చేలా చట్టాలు చేశాయి. హంగేరీ అధ్యక్షులు విక్టోర్ ఓర్బాన్ తన అధికారాన్ని నిలబెట్టుకోవటానికి దేశంలో పలు మార్లు అత్యవసర పరిస్థితులు ప్రకటించారు. అమెరికాలోని కెంటకీలో బొగ్గు తవ్వకాలకు వ్యతిరేకంగా సాగిన నిరసనలపై అణచివేత, అబార్షన్లను నిషేధిస్తూ టెక్సాస్‌లో నిర్ణయం... అమెరికా స్థాయిని దిగజార్చిందని వి-డెమ్ తెలిపింది.

భారత్‌లో...

జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేశాక, పౌర హక్కులను దెబ్బతీస్తూ కేంద్రం ఏకపక్ష ధోరణితో నిర్ణయాలు చేస్తోంది. కోవిడ్ సమయంలో లాక్‌డౌన్‌తో ఎంతోమంది పేదలు రోడ్డునపడ్డారు. 'ఎన్నికలతో కూడిన నియంతృత్వ' దేశంగా భారత్‌ను 2021లో వి-డెమ్ పేర్కొంది. పౌర సంఘాల అణిచివేత, వాక్ స్వాతంత్రంపై దాడులు, మీడియా, పౌర హక్కుల కార్యకర్తలపై నిఘా పతాక స్థాయికి చేరింది. విద్య, సాంస్కృతిక రంగాల్లో అణచివేత, వివక్ష తీవ్రస్థాయికి చేరాయి. తప్పుడు సమాచారం, మతపరమైన ఏకీకరణ..నియంతృత్వాన్ని బలోపేతం చేస్తున్నాయి. అందువల్లే ఆఫ్ఘనిస్తాన్, భారత్, బ్రెజిల్, మయన్మార్‌లు 'నియంతృత్వ' దేశాలుగా వేగంగా మార్పు చెందుతున్నాయి.

లానింగ్ మెరుపులు

యుపిపై 42 పరుగుల తేడాతో ఢిల్లీ గెలుపు



ముంబయి: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించింది. మంగళవారం యుపి వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 42పరుగుల తేడాతో గెలిచింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 211 పరుగుల భారీ స్కోర్‌ను నమోదు చేసింది. ఛేదనలో యుపి జట్టు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 5వికెట్లు కోల్పోయి 169పరుగులే చేయగల్గింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీకి కెప్టెన్ మెగ్ లానింగ్ ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడింది. లానింగ్ కేవలం 42బంతుల్లోనే 10ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 70 పరుగులు చేసింది. కెప్టెన్ లానింగ్ బ్యాట్‌తో రెచ్చిపోతే, మరో ఓపెనర్ షెఫాలీ ఆమెకు అండగా నిలుస్తూ పరుగులు రాబట్టింది. ఇద్దరూ కలిసి తొలి వికెట్‌కు 67 పరుగులు జోడించాక తహ్లియా బౌలింగ్‌లో కిరణ్‌కు క్యాచ్ ఇచ్చి షెఫాలీ అవుటైంది. 14 బంతులు ఆడిన షెఫాలీ ఫోర్, సిక్సర్‌తో 17 పరుగులు చేసింది. మరోవైపు లానింగ్ 34 బంతుల్లో 7ఫోర్లు, 3సిక్సర్లతో అర్ధ సెంచరీని పూర్తి చేసుకుంది. చివర్లో జొన్నాసెన్(42నాటౌట్; 20బంతుల్లో 3ఫోర్లు, 3 సిక్స ర్లు), రోడ్రిగ్స్(34నాటౌట్; 4ఫో ర్లు) ధాటిగా బ్యాటింగ్ ఆడడం తో స్కోర్‌బోర్డు పరుగెత్తింది. ఇస్మాయిల్, రాజేశ్వరి గైక్వాడ్, తహ్లియా, సోఫీకి ఒక్కో వికెట్ దక్కాయి.

ఛేదనలో యుపి ఓపెనర్లు హీలీ(24), శ్వేత(1), నవ్‌గైర్(2) నిరాశపరిచారు. ఆ తర్వాత మెక్ గ్రాత్(90నాటౌట్; 50బంతుల్లో 11ఫోర్లు, 4సిక్సర్లు) భీకర ఇన్నింగ్స్ ఆడింది. దేవిక వైద్య(23) రాణించింది. నోర్రీస్‌కు మూడు, కాప్, శిఖా పాండేకు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ జొన్నాసెన్‌కు లభించింది.

స్కోర్‌బోర్డు
(సంక్షిప్తంగా..)

ఢిల్లీ క్యాపిటల్స్ మహిళలు..
లానింగ్ 70, రోడ్రిగ్స్(నాటౌట్) 34, జొన్నాసెన్ (నాటౌట్) 42, ఇస్మాయిల్(1/29), గైక్వాడ్ 1/31)

యుపి వారియర్స్ మహిళలు..
మెక్ గ్రాత్ 90(నాటౌట్), హీలీ 24, జొన్నాసెన్ (3/43), శిఖా పాండే (1/18)

డబ్ల్యుపిఎల్‌లో నేడు..
గుజరాత్ జెయింట్స్ × రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు
(వేదిక: బ్రాబౌర్న్ స్టేడియం, రాత్రి 7.30గం॥ల నుంచి)

ఉమెన్స్ డే సందర్భంగా..

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం(8న) జరిగే డబ్ల్యూపీఎల్ మ్యాచ్ టికెట్లను ఉచితంగా అందించనున్నట్లు బీసీసీఐ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. డబ్ల్యూపీఎల్‌లో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా ముంబయి వేదికగా జరిగే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ గుజరాత్ జెయింట్స్ మ్యాచ్ టిక్కెట్లు ఉచితంగా అందించనున్నట్లు తెలిపింది. ఉమెన్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లకు మహిళా ప్రేక్షకులను ఇప్పటికే ఉచితంగా అనుమతిస్తోంది.

సుధీర్ 'డీజే' లుక్




హీరో సుధీర్ బాబు తన యాక్టింగ్ స్కిల్స్‌తో ముందెన్నడూ లేనంతగా నటించేందుకు సిద్ధమయ్యారు. కమెడియన్, రైటర్, డైరెక్టర్ హర్షవర్ధన్ దర్శకత్వంలో రూపొందుతున్న 'మామ మశ్చీంద్ర' చిత్రంలో సుధీర్‌బాబు మూడు వేర్వేరు పాత్రల్లో నటిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రెండు పాత్రలకి సంబంధించిన ఫస్ట్ లుక్స్ రిలీజ్ అయ్యాయి. 'దుర్గ' పాత్రలో సుధీర్ బాబు చాలా లావుగా కనిపించాడు. రెండో పాత్ర పరశురామ్ లుక్‌లో సాల్ట్ అండ్ పెప్పర్ స్టైల్ లో కనిపించాడు. ఈ రెండు పోస్టర్స్ లో పూర్తిగా కొత్త మేకోవర్‌లో కనిపించాడు సుధీర్ బాబు. ఇప్పుడు చిత్రంలో మూడో పాత్ర 'డీజే' లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. ఈ పోస్టర్‌లో సుధీర్ బాబు ట్రెండీగా కనిపిస్తున్నాడు. ఇది చూసి అభిమానులు సంబరపడిపోతున్నారు. ఇన్ని వేరియేషన్స్ ఉన్న సినిమాలో సుధీర్ బాబు నటించడం ఇదే మొదటిసారి.

విడుదల సన్నాహాల్లో 'ఓ సాథియా'



ఈ మధ్యకాలంలో ప్రేమే కథా వస్తువుగా ఉండే సినిమాలు వస్తున్నాయి. అలాంటి ప్రేమకథా చిత్రమే 'ఓ సాథియా'. తన్విక జశ్విక క్రియేషన్స్ బ్యానర్ మీద చందన కట్టా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా దివ్యా భావన దర్శకత్వం వహిస్తున్నారు. 'జీ జాంబి' సినిమాతో హీరోగా పరిచయమైన ఆర్యన్ గౌర 'ఓ సాథియా' ద్వారా రెండో సారి ప్రేక్షకుల ముందుకు రాబోతోన్నారు. హీరోయిన్‌గా మిస్తీ చక్రవర్తి నటిస్తుంది. ఇప్పుడు మూవీ పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు చివరి దశలోకి వచ్చాయి. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇప్పటికే ఈ మూవీ నుండి విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ సోషల్ మీడియాలో ఎంతగానో ఆదరణను దక్కించుకుంది.

'సార్పట్ట పరంబరై' సీక్వెల్




ఐడియా లాజికల్ సినిమాలు చేసే పా.రంజిత్ తన మార్క్ మూవీస్ నుంచి కాస్త పక్కకి వచ్చి చేసిన మూవీ 'సార్పట్ట పరంబరై'. ఆర్య హీరోగా నటించిన ఈ మూవీ నార్త్ చెన్నై ప్రాంతంలో 80 కాలంలో జరిగే బాక్సింగ్ కథతో తెరకెక్కింది. వారసత్వంగా బాక్సింగ్‌ని పాటించే రెండు వర్గాల మధ్య పా.రంజిత్ రాసిన కథ కథనాలు ఆసక్తికరంగా ఉంటాయి. హీరో ఆర్యకి అపోజిట్ రోల్ 'జాన్ కొక్కెన్' నటించాడు. కోవిడ్ కారణంగా థియేట్రికల్ రిలీజ్ ని మిస్ అయిన సార్పట్ట పరంబరై సినిమా నేరుగా ఒటీటీలో రిలీజ్ అయ్యింది. మంచి రెస్పాన్స్ రావడంతో ఈ మూవీ ఈ సినిమాకి సీక్వెల్‌ని అనౌన్స్ చేశాడు. ఇప్పుడు కోలీవుడ్‌లో హాట్ టాపిక్ అయ్యింది. పా.రంజిత్ ప్రస్తుతం చియాన్ విక్రమ్ తో 'తంగలాన్' అనే సినిమా చేస్తున్నాడు. ఇది అయిపోగానే సార్పట్ట పరంబరై 2 పనులు మొదలుపెట్టనున్నాడు.

'వెన్నెల్లో ఆడపిల్ల' పాట విడుదల

కార్తికేయ గుమ్మకొండ నటిస్తున్న తాజా చిత్రం 'బెదురులంక 2012'. రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పనేని నిర్మిస్తున్న ఈ సినిమాతో క్లాక్స్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. హీరోయిన్ నేహాశెట్టి నాయికగా నటిస్తోంది. ఈ సినిమాకు సంబంధించి మొదటి పాటను విడుదల చేశారు మేకర్స్. 'వెన్నెల్లో ఆడపిల్ల కవ్వించే కన్నెపిల్ల ...' అంటూ సాగే ఈ గీతాన్ని కిట్టు విస్సాప్రగడ రాయగా, మెలోడీ బ్రహ్మ మణిశర్మ అద్భుతమైన బాణీ సమకూర్చారు. దీన్ని హారిక నారాయణ్, జె.వి. సుధాంశు ఆలపించారు. లెజెండరీ కొరియోగ్రాఫర్ బృందా మాస్టర్ దీనికి నృత్య దర్శకత్వం వహించారు. గోదావరి తీర ప్రాంతంలో ఓ గ్రామంలో రొయ్యల చెరువు మధ్య రాత్రి వేళల్లో ఈ పాటను చిత్రీకరించారు.

డబ్ల్యుటిసి ఫైనల్ బెర్త్ భారత్‌కే..

న్యూజిలాండ్‌పై శ్రీలంక టెస్ట్ సిరీస్‌ను నెగ్గడం కష్టమే!



అహ్మదాబాద్: ఐసిసి ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్‌కు చేరే ఛాన్స్ ఎక్కువశాతం భారత్‌వైపే ఉన్నాయి. ఆస్ట్రేలియా జట్టు ఇండోర్ టెస్ట్‌లో భారత్‌ను ఓడించి డబ్ల్యుటిసి ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకోగా.. మరో స్థానం కోసం భారత్, శ్రీలంక జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. తొలి రెండు టెస్టుల్లో గెలిచిన టీమిండి యా.. మూడో టెస్ట్‌లో అనూహ్యంగా ఓటమిపాలై డబ్ల్యుటిసి ఫైనల్ బెర్త్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. ఈ క్రమంలో గురువారం(9నుంచి) ఆస్ట్రేలియాతో జరిగే నాల్గో టెస్ట్‌లో భారతజట్టు గెలిస్తే సమీకరణాలతో నిమిత్తం లేకుండా నేరుగా ఫైనల్‌కు చేరనుంది. ఒకవేళ ఆ టెస్ట్‌లో భారత్ ఓడినా, కనీసం డ్రా చేసుకున్నా.. శ్రీలంక- న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగే టెస్ట్ సిరీస్ ఫలితం కోసం వేచిచూడాల్సి ఉంటుంది. న్యూజిలాండ్‌తో శ్రీలంక రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ఆడేందుకు వెళ్లనుంది. ఆ పర్యటనలో శ్రీలంక జట్టు న్యూజిలాండ్‌తో జరిగే రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేయాల్సి ఉంటుంది. ఇరుజట్ల మధ్య ఈనెల 9నుంచే క్రైస్ట్‌చర్చ్ వేదికగా తొలి టెస్ట్, 17నుంచి వెల్లింగ్టన్ వేదికగా రెండో టెస్ట్ జరగనుంది. న్యూజిలాండ్ గడ్డపై ఆ జట్టును శ్రీలంక ఓడించడం కత్తిమీద సాము వంటిదే. ఒకవేళ ఆస్ట్రేలియాతో జరిగే నాలుగో టెస్టులోనూ భారత్ ఓటమిపాలై, న్యూజిలాండ్‌పై సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేస్తే శ్రీలంక ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ తుదిపోరుకు అర్హత సాధిస్తుంది. ఇదిలా ఉండగా.. అహ్మదాబాద్ వేదికగా మార్చి 9 నుంచి భారత్, ఆసీస్ మధ్య నాలుగో టెస్టు ప్రారంభంకానుండగా.. అదేరోజు క్రైస్ట్‌చర్చ్ వేదికగా న్యూజిలాండ్, శ్రీలంక తొలి టెస్టూ జరగనుంది. ఇక జూన్ 7-11 మధ్య లండన్‌లోని ఓవెల్ మైదానంలో డబ్ల్యుటిసి ఫైనల్ జరగనుండగా.. జూన్ 12ను రిజర్వ్ డేగా ఐసిసి ప్రకటించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68